# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com


**నమ్మలేని నిజాలు**

పచ్చని చెట్టు
సమాజ సేవాహితం
మహర్షి తుల్యం.

రాచ జాలర్లు
మనగోడు తటాకం
గెలుపు వల.

బట్ట తలలు
కుదురని పెళ్లిల్లు
కేశ క్లేశాలు.

సంగీత లోకం
సర్వజీవ తన్మయం
తెగిన తంత్రి.

రూపి పతనం
ధరలు తారాపథం
దుఃఖ జీవితం.



- రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

దివికేగిన నటశేఖర
'తేనె మనసుల' పిల్లోడు !
సినిమాల్లో వెలుగొందెను
బుర్రిపాలెం బుల్లోడు !.

సూపర్ స్టార్ కృష్ణుడతను
అభినవ అల్లూరి !
డైలాగులు చెపుతుంటే
వింటాం చెవులూరి !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245


హైదరాబాద్ | గురువారం 17-11-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :29 | సంచిక: 81 | పేజీలు:6 | వెల: రూ.1/-





వరదాచారి, కె.ఎల్.రెడ్డిల శ్రద్ధాంజలి సభలో ప్రసంగిస్తున్న కే.కేశవరావు. వేదికపై విరాహత్ అలీ, చక్రధర్, రవికాంత్ రెడ్డి, దాసు కేశవరావు, కె. శ్రీనివాస్ రెడ్డి, కె. రామచంద్రమూర్తి , వేణుగోపాల నాయుడు. ప్రసంగిస్తున్న కె.శ్రీనివాస్ రెడ్డి, కె.రామచంద్రమూర్తి, విరాహత్ అలీ, బైస దేవదాసు

## జర్నలిజానికి నిలువెత్తు నిదర్శనం వరదాచారి, కేఎల్ రెడ్డి

ప్రముఖ పాత్రికేయులు వరదాచారి, కేఎల్ రెడ్డి విలువలతో కూడిన జర్నలిజం చేశారని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. వారిద్దరి సంస్మరణ సభ ఈనెల 10న గురువారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ జర్నలిస్టు చక్రధర్ అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం, వయోధికుల పాత్రికేయుల సంఘం, ప్రెస్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యుడు కే. కేశవరావు, సీనియర్ జర్నలిస్టులు హాజరయ్యారు. వరదాచారి, కేఎల్‌రెడ్డి చిత్రపటాలకు పలువురు ప్రముఖులు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం దత్తాత్రేయ మాట్లాడుతూ వరదాచారి దగ్గర ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నానని గుర్తు చేశారు. ఆంగ్ల భాషలో ఎంతో పట్టు కలిగిన వరదాచారి తెలుగు భాషపై ఉన్న మక్కువతో తెలుగు జర్నలిస్టుగా కొనసాగారన్నారు. వరదాచారి విలువలను ఎప్పుడూ కోల్పోలేదన్నారు. కేఎల్ రెడ్డి తెలంగాణ కోసం నిబద్ధత కలిగిన రచనలు చేశారని, తెలంగాణ కోసం జైలుకు వెళ్లారని గుర్తు చేసుకున్నారు. రాజ్యసభ సభ్యుడు కే.కేశవరావు మాట్లాడుతూ విలువలతో పనిచేసిన పాత్రికేయుల్లో వరదాచారి, కేఎల్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. స్థితప్రజ్ఞులుగా చిరకాలం గుర్తుండిపోయే పాత్రికేయులు జీఎల్ వరదాచారి, కేఎల్ రెడ్డి అని పలువురు వక్తలు కొనియాడారు. వారిపేర్లపై రాష్ట్రస్థాయి అవార్డులు ఏర్పాటు చేస్తే, సహకారాన్ని అందిస్తామనీ చెప్పారు.

ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) అధ్యక్షులు కే. శ్రీనివాసరెడ్డి, సీనియర్ పాత్రికేయులు కే. రామచంద్రమూర్తి, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేణుగోపాలనాయుడు, ప్రధాన కార్యదర్శి, రవికాంత్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ, వయోధిక పాత్రికేయుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసు కేశవరావు, ఉడయవర్లు, నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. ఇద్దరు దిగ్గజ సీనియర్ పాత్రికేయులు జీఎస్ వరదాచారి, కేఎల్ రెడ్డి, కేవలం 24 గంటల వ్యవధిలో మరణించడం పట్ల సభ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. వారికి మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించింది. ఈ సందర్భంగా వక్తలు వారితో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. వారు భాషతో పాటు సమస్యల లోతులపై సంపూర్ణ అవగాహన ఉన్న పాత్రికేయులనీ, అజాతశత్రువులుగా జీవించారని కొనియాడారు. వరదాచారి నిలకడ, స్థిరత్వం ఉన్న జర్నలిస్టు అనీ, కేఎల్ రెడ్డి అందుకు భిన్నంగా ఉండేవారనీ, కానీ ఇద్దరి లక్ష్యం ఒక్కటేనని చెప్పారు. ఇరువురూ పాత్రికేయ వృత్తిని ఉన్నతంగా నిలిపారనీ, నీతి, నిజాయితీ, నిబద్ధతకు మారుపేరుగా నిలుస్తూ, మచ్చలేని వ్యక్తిత్వంతో జీవించారని తెలిపారు. వరదాచారి ఎదుటివారి భావజాలాన్ని అర్థం చేసుకొనే వారినీ, ఎట్టి పరిస్థితుల్లోనూ విమర్శ చేసేవారు కాదనీ స్పష్టం చేశారు. అందువల్లే ఆయన అజాతశత్రువుగా నిలిచారన్నారు. ఆయన చేసిన సేవల్ని, వక్తలు గుర్తు చేసుకున్నారు.

గతంలో కే.ఎల్.రెడ్డికి ప్రభుత్వం మంజూరు చేసిన 15 లక్షల రూ॥లతో ట్రస్టును ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం కె.యల్.రెడ్డి పేరున ఉత్తమ జర్నలిస్టు అవార్డును ఇవ్వడం సముచితంగా వుంటుందని సీనియర్ జర్నలిస్టు చక్రధర్ సూచించారు. కార్యక్రమంలో వరదాచారి కుటుంబసభ్యులు, కె.యల్.రెడ్డి సోదరులు కంచర్ల ఇంద్రసేనారెడ్డి, సత్యనారాయణరెడ్డి పలువురు సీనియర్, పాత్రికేయులు పాల్గొన్నారు.



డా॥ సమ్మన్న రచించిన 'చింతన' గ్రంథావిష్కరణలో బైస దేవదాసు, దైవజ్ఞశర్మ, కొండపల్లి నీహారిణి, డా॥కె.వి. రమణాచారి, ఎస్. వెంకట నారాయణ, డా॥ సమ్మన్న, చిక్కా రామదాసు తదితరులు.



బైస దేవదాసు, ఆదినారాయణ, సంకు సుధాకర్‌లకు 'జీవన సాఫల్య పురస్కారం' ప్రదానం చేస్తున్న డా॥ కె.వి.రమణాచారి.

## ఘనంగా జరిగిన తెలుగు సాహిత్య కళాపీఠం 12వ వార్షికోత్సవం

తెలుగు సాహిత్య కళాపీఠం 12వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం త్యాగరార గానసభలో సంస్థ వ్యవస్థాపక దినోత్సవ జీవన సాఫల్య పురస్కారాలు, ప్రతిభా పురస్కారాల ప్రదానం ఘనంగా జరిగింది. ఈ సభకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా॥కె.వి. రమణాచారి ముఖ్య అతిథిగా పాల్గొని పురస్కారాలు ప్రధానం చేశారు.



నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసుకు, ఆదిలీల ఫౌండేషన్ ఢిల్లీ జాతీయ అధ్యక్షులు ఆదినారాయణకు, ముంబాయి ఆంధ్రమహాసభ & జింఖానా అధ్యక్షులు సంకు సుధాకర్‌కు "జీవన సాఫల్య పురస్కారాలు'' డా॥ కె.వి.రమణాచారి ప్రదానం చేశారు. మౌనశ్రీ మల్లిక్, పొత్తూరి సుబ్బారావు, అట్టెం దత్తయ్య, డా॥భార్గవ్ జిందం అశోక్,సాగర్ల సత్తయ్య, ఎన్నవెల్లి రాజమౌళి, డా॥ , దాసరి శాంతాకుమారి, మిర్యాల నిఖిల కాళ్ళశ్రీను, సమతాగోపాల్, పెద్దూరి వెంకటదాసులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఆదర్శకిరణం పత్రికా సంపాదకులు వంగా బాలరాజగౌడ్, పంజాల సురేశ్‌గౌడ్‌లకు ఆత్మీయ సత్కారం జరిగింది.

డా॥ఈటెల సమ్మన్న రచించిన "చింతన" గ్రంథాన్ని డా॥రమణాచారి ఆవిష్కరించారు. కొండపల్లి నీహారిణి, చింతన గ్రంథాన్ని సమీక్షించారు. ది ఫారిన్ కరస్పాండెంట్స్ అడ్వయిజరీ కమిటీ, న్యూ ఢిల్లీ చైర్మన్ ఎస్. వెంకట నారాయణ సభా ప్రారంభకులుగా పాల్గొని తమ అమూల్య సందేశాన్ని అందజేశారు. అభినవ దాశరథి దోరవేటి చెన్నయ్య నిర్వహణలో జరిగిన కవి సమ్మేళనంలో రమాదేవి కులకర్ణి, ఎం.అరుణ కుమారి, మిర్యాల లక్ష్మి, డా॥చీదెళ్ళ సీతాలక్ష్మి, సాధనాల వి.యస్. నాయుడు, తంగిరాల చక్రవర్తి, పెనరు లింగారెడ్డి, టి. ఆశీర్వాదం, డా॥కావూరి శ్రీనివాస్, మండల స్వామి, బోనగారి రాజారెడ్డి, ఎన్.వెంకట నారాయణలు పాల్గొన్నారు. మొదట బతుకమ్మ రాజశేఖర్ కళాబృందంలోని 40 మంది కళాకారులచే జానపద గీతాలు, తెలంగాణ కళారూపాల ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. సోంపెంటేశ్ 'అమ్మ' మీదపాడిన పాట సభికులను రంజింపచేసింది. బతుకమ్మ రాజశేఖర్ మాట్లాడుతు సోంపెంటేశ్, మట్టశివలు నాకు శ్వాసతో సమానమని కొన్ని వందల ప్రోగ్రాంలు విజయవంతం గావడానికి ముఖ్య కారకులని తెలిపారు. చిరు లారెన్స్ అరుణ్‌కుమార్, శ్రీమతి హెచ్.గీతా స్వరూపరాణి, బీబీనగర్ ఎం.పి.పి. వై. సుధాకర్‌గౌడ్, యం.ఇ.ఓ.పి. నాగవర్ధన్‌రెడ్డి, యాదాద్రి భువనగిరి, డి.ఈ.ఓ. కె.నారాయణరెడ్డిల సహకారం మాకు ఎళ్ళవేళలా వుండడం మా అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. పదేళ్ళక్రితం చిక్కా రామదాసుగారు తమ సంస్థ కార్యక్రమానికి మాచే ప్రదర్శనలు ఇప్పించి, నాకు 'బతుకమ్మ రాజశేఖర్'అని బిరుదు ప్రదానం చేసి వారి ప్రతి కార్యక్రమానికి మమల్ని ఆహ్వానించి మా కళాకారుల బృందానికి ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని కలుగజేస్తున్నందులకు తమకు సహకరిస్తు తమ ప్రదర్శనలను ఆదరిస్తున్న పేరు పేరున అందరికీ కృతలు తెలిపారు బతుకమ్మ రాజశేఖర్.





బతుకమ్మ రాజశేఖర్ కళా బృందంతో డా॥.కె.వి.రమణాచారి, అతిథులు.

గత పన్నెండేళ్ళుగా తెలుగు సాహిత్య కళాపీఠంకు ఆర్థిక, హార్థిక సహకారాలు అందజేస్తున్న వారందరికీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కా రామదాసు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాన కార్యదర్శి పట్టాల అశోక్ సభను పర్యవేక్షించారు. డా॥ ఎంపల్లి బుచ్చిరెడ్డి, చెరువుపల్లి యాదగిరి, డా॥ కేతవరపు రాజ్యశ్రీ, బద్దం ధనంజయ, కురిమిళ్ళ నరసింహగౌడ్ అతిథులుగా పాల్గొన్నారు. సంస్థ సభ్యులు చిక్కా శంకర్, చిక్కా దేవదాసు, సింగిరెడ్డి హన్మంతరెడ్డి, డా॥పూల దశరత్, జె. ప్రసన్న, బిల్ల దీపిక, సి.హెచ్. రవి కిరణ్‌లు సభా విజయానికి తోడ్పడ్డారు.

## ఆలోచనని, ఆనందాన్ని అందించేదే గొప్ప సాహిత్యం

మనుగడ సాగించడానికి ఆలోచనని, ఆనందాన్ని కలిగించే శక్తి సాహిత్యానికి వుందని సీనియర్ జర్నలిస్టు బైస దేవదాసు అన్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో గల సిటీ కల్చరల్ క్లబ్‌లో ఆదివారం రాజావాసిరెడ్డి మల్లీశ్వరి రచించిన "వర్ణిక" పుస్తకావిష్కరణ పరిచయ సభ బైస దేవదాసు అధ్యక్షతన జరిగింది. సమాజస్థితి గతులపై మనం వెల్లడించే అభిప్రాయాలను అక్షరీకరించినప్పుడు చదువరులను ఆలోచింపజేసి ఆనంద పరిచే విధంగా రచనలు వుండాలని అన్నారు. రచనలు చేస్తున్న వారు రచిస్తున్నదానికి విరుద్ధంగా జీవించడం సమంజసం కాదన్నారు. విలువల కోసం జీవించాలనుకున్నపుడు ఆ విలువలను కాపాడాల్సిన బాధ్యత మనదై వుండాలన్నారు. ఒక పుస్తకం ఆవిష్కరణ జరిగిన అనంతరం ఆ పుస్తకంపై పరిచయ సభ మంచి కార్యక్రమమని తెలిపారు. రాజావాసిరెడ్డి మల్లీశ్వరికి తెలుగు, సంస్కృతం పట్ల పట్టు వుండడంతో గొప్పగా రచనలు చేయగలుగుతున్నారని, ఒక్క ఈ 'వర్ణిక'నే కాదు, ఆమె రాసిన పుస్తకాలను పరిశీలిస్తే తెలుస్తుందన్నారు. పుస్తకాలు తక్కువే రాసిన ఎక్కువ ప్రయోజనమున్న సాహిత్యాన్ని సమాజానికి అందించినందులకు అభినందించారు. ఈ వర్ణికలోని లేఖాసాహిత్యం ఎంతో ఉపయోగకరంగా వుందని, అందులోని భాషా, శైలి గొప్పగా వుందని కొనియాడారు.

ప్రముఖ కవి విమర్శకుడు బిక్కి కృష్ణ మాట్లాడుతూ... "నా కనుల కలల మొగ్గలను కోయబోకు ప్రియా...నను కలత అలల చిక్కులలో తోయబోకు ప్రియా" అంటూ వేదన పడితే కానీ కవిత రాదు మల్లీశ్వరిగారి గజల్స్ అర్థం చేసుకోవాలంటే వారు మంచి ప్రేమికులై వుండాలి అన్నారు .అలాగే ఆమె రచన వర్ణికలోని లేఖలు కవితాత్మతో వున్నాయి.. అంతర్జాతీయ స్థాయిలో రెండు రికార్డ్సు తీసుకున్న మల్లీశ్వరిగారిని అభినందించాలి. సామాజికమైన అంశాలని, ప్రేమతత్వాన్ని గురించి రాశారు. ఆమెలో ఉన్న ప్రేమ ఇందులో కనిపిస్తుంది. తన భావనలో ఉంది ప్రేమ.. హృదయంతో పరిపూర్ణమైన ప్రేమ.నిండిన ఈమె ఒకచోట మనసు మందారం అంటుంది. ఇక్కడ మందారం ఎరుపుని ప్రేమ సింబల్‌గా వాడారు. అనురాగంగా ఈ పదాన్ని వాడారు. మల్లీశ్వరి గారి పద ప్రయోగంలో , భావ వ్యక్తీకరణ లో క్షేమేంద్రుడు చెప్పిన ఔచిత్యం బాగా ఔచితీవంతంగా ఉంటుంది వర్ణికలో వుండే 102 లేఖలలో చివరగా "నిశ్శబ్దమే తోడైన నింగి నీలిమ" అనే లేఖను చివరికి పెట్టడం చాలా బావుంది. నింగి నీలిమ నిశ్శబ్దంగా వున్నట్లు తన మనసు నింగినీలిమ మాదిరి ఉందని చెప్పింది. రాగద్వేషాలకి అతీతంగా వున్న కవయిత్రి మల్లీశ్వరి. ఈర్ష్య అసూయ ద్వేషం వదిలేసి కవిత్వం రాసి ఆనందించి పదిమందికి ఆనందం పంచాలని చూస్తారన్నారు.




రాజావాసిరెడ్డి మల్లీశ్వరి రచించిన "వర్ణిక" గ్రంథావిష్కరణ, పరిచయ సభలో సంతోష్, డా॥ వెనిగెళ్ళ రాంబాబు, రాజావాసిరెడ్డి మల్లీశ్వరి, బైస దేవదాసు, బిక్కి కృష్ణ, ఇసనక మురళీధర్, విజ్జి, రాధాకుసుమ.

డా॥ వెనిగెళ్ళ రాంబాబు మాట్లాడుతూ... సాహిత్య పరామర్శకు, సాహిత్య విశ్లేషణకు మనం మల్లినాగసూరిగారి పేరు వినేవాళ్ళం. మళ్ళీ మనకు ఆ తీరు మల్లీశ్వరిగారిలో కనిపిస్తోంది. కొన్ని పంటలు చాలా తక్కువ కాలంలో వెలుగులోకి వస్తాయి. ఒకవ్యక్తి వెలుగులోకి రావడాన్ని చూస్తే... గోంగూర మొక్క నాటితే వారం రోజుల్లో దాని జీవితం ముగుస్తుంది. మామిడి చెట్టునో, కొబ్బరి చెట్టునో నాటితే అర్థశతాబ్దపైగా మనకి దాని వైభవం విరాజిల్లుతుంది. ఈ మామిడి వృక్షం వంటి వారు మన మల్లీశ్వరిగారని అన్నారు.

లేఖ రాయాలంటే భావం కావాలి, భాష కావాలి, పరిమాణం పట్ల అవగాహన కావాలి. మల్లీశ్వరి గారికి అది వుంది. ఉత్తరం అంటే ఒక ఇన్లాండ్ కవరుకానీ మామూలు కవరు కానీ... కొంత పరిమితిలోనే రాస్తాం. సమయ సందర్భాలతో పాటు చోటుని కూడా దృష్టిలో వుంచుకుని రాశారు. వీరు రాసిన వర్ణిక హోల్ బాడీ స్కానింగ్ లాంటింది. విశ్వరూపంగా వారి జీవితాన్ని, గతాన్ని, భావాన్ని ఇందులో దర్శించడానికి అవకాశం వుంది. 200 పేర్లను ఎంతో అందంగా అందించారు. కొత్త కొత్త పదాలని ఇచ్చి మనకి ఒక నిఘంటువుని అందించారు. వారి గ్రంథంలో ప్రణయం వుంది, ప్రళయం వుంది. వారి గ్రంథాన్ని విశ్లేషించే కన్నా కొన్ని అంశాలని తెలుసుకోవడం మంచిది. వసంతాన్ని ఒక వాగులోకి ప్రవహింపచేసే ప్రయత్నం. "మరువనీవు.... నీ జతను.... వలపు వాసంతిక వాగునై...." అంటూ....ఈ శబ్ద సౌందర్యం హృదయాన్ని హత్తుకోవటం ఈ గ్రంథంలో వుంది. ఒక రుతువుతో ఆగలేదు. వీరు ఒక విదుషీమణి. "మరువనీవు... తంగేడులా అందమై పోనీ... సదా వలపు వాసంతికనై" అంటూ రుతువుల గురించి చక్కగా చెప్పారు. కాలగమనాన్ని వరుసక్రమంలో చూపిస్తూ... మిట్టమధ్యాహ్నాన్ని ఎత్తు పల్లాలెరుగని మిట్ట మధ్యాహ్నపు మిడిసిపాటు, మనిషిలో ఉన్న భావనలని అద్భుతంగా వర్ణించారు. హృదయ సౌరభాన్ని దశదిశలా వర్ణింపచేశారు ..అంటూ వర్ణికలోని ఎన్నో విషయాలను


(మిగతా 6వ పేజీలో...)


**చరిత్రలో నేటినిజం**



కం॥ ఆశ్విక వేగము తోడుత
శాశ్వత మగు సేవ శేఖరు సద్గుణ మణియౌ
ఈశ్వర వరప్రసాదున
కోశ్వరు దుందించు గాథ వెల్సిన చదువుమున్ !!

(నవంబర్ 17 వర ప్రసాదరెడ్డి
పుట్టిన రోజు...)



–రాధశ్రీ
సెల్:9494481210

# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com

website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 17-11-2022


## డా॥పత్తిపాక మోహన్‌కు ఆంధ్రా అసోసియేషన్ సన్మానం



కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్‌ను ఢిల్లీలోని ఆంధ్రా అసోసియేషన్ సన్మానించింది. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి ఆచార్య గంప వెంకట రామయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన మోహన్ రచించిన "బాలల తాత బాపూజీ" గేయ కథకు ఇటీవల బాల సాహిత్యపురస్కారం లభించిన విషయం తెలిసిందే.









# బాల సాహిత్య పురస్కారం అందుకున్న డా॥పత్తిపాక మోహన్

మానేరు వాగు ప్రాణదాయినియై, సుజలాం, సుఫలాంగా ఇక్కడి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తోంది. ఇక్కడి ప్రజల బతుకు తెరువుకు ఆధారభూతమై నిలిచింది. సాగు, త్రాగు నీరుకు వరప్రదాయినై నిలిచిపోయింది. గోదావరికి ఉప నదిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా గుండా పారినా కొత్తగా ఏర్పడిన రాజన్న సిరిసిల్లా జిల్లాలో ఉధ్భవించి, అమృతవర్షి ణియై, జీవామృతదారలను అందిస్తోంది. ఒకప్పుడు మెట్ట ప్రాంతంగా, కరువు సీమగా, కల్లోలిత ప్రాంతంగా, చేనేత కార్మికుల ఆత్మహత్యల నిలయంగా, ప్రళయంగా నిలిచి, కళ తప్పి అపసవ్యంగా, అల్లకల్లోలంగా ఉన్న ఈ ప్రాంతం 2014 ప్రత్యేక తెలంగాణా ఆవిర్భావంతో సస్యశ్యామలమై ప్రగతి బాటలో పయనిస్తోంది. ఇక్కడ నర్మాల దగ్గర ఎగువ మానేర్ ప్రాజెక్ట్, వరదవెల్లి దగ్గర మధ్యమానేర్ ప్రాజెక్ట్, కరీంనగర్ లో దిగువ మానేర్ ప్రాజెక్టయి ముచ్చటగా మూడు ప్రాజెక్ట్ లతో కళకళలాడుతూ ఈ ప్రాంతాలకు సస్యదాయినియై నిలిచింది. మరో ప్రాజెక్ట్ అనంతసాగర్ ప్రాజెక్ట్ తీసుకొంటే నాలుగో ప్రాజెక్ట్ కిందే లెక్కవేయాల్సి వస్తుంది. దీంతో మూడు ప్రాజెక్టు ఒక్క రాజన్న సిరిసిల్లా జిల్లా కే సొంతమై ఉండటం ఈ ప్రాంత వాసులు చేసుకొన్న జలసౌభాగ్యపు అదృష్టమే నని చెపొల్సి ఉంటుంది. వేములవాడ ఎగువ ప్రాంతంలో పుట్టిన మూలవాగు మానేరు పిల్లతల్లే. జ్ఞానపీఠి డా.సినారే, మధురకవి మామిడిపల్లి సాంబకవి, మిద్దె రాములు వంటి వారు మూలవాగు తీరం నుండి రచయితలుగా ఎదిగితే, తొలితరం నవలా రచయిత జి.రాములు, గూడూరి సీతారాం, గర్మకుర్తి సురమౌళి, కనపర్తి, తదితరులు సిరిసిల్లా మానేరు తీరం నుండి పురుడు పోసుకొన్నారు.

మొత్తానికి రాజన్న సిరిసిల్లా జిల్లాలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారు వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రం కాగా, సిరిశాల చేనేత, జౌళి వస్త్రోత్పత్తి కేంద్రమై అనాది నుండి విరాజిల్లుతు, పద్మశాలీలకు బతుకు తెరువై నిలిచిపోయింది. ఇక్కడ మానేటి, మూలవాగు పరీవాహక ప్రాంత జీవధారల్లో, ఇక్కడి సాహితీ సంస్కృతుల సంగమంతో జమిలీయై ఎంతో మంది కవులు, రచయితలు, కళాకారులు ఉధ్భవించారు. వారు ఇలా ఎదగడానికి ఆస్కారం ఏర్పడింది. తద్వారా వీరు తెలుగు సాహితీ, సాంస్కృతిక రంగాలలో తమ ప్రతిభలను నాటి నుండి నేటి వరకు అప్రహితంగా చాటుకొన్నారు. అలా ఒక మానేటి ధారల నుండి వచ్చిన సాహితీ తరంగం బాల సాహితీ వేత్త, కవి, రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలీ, ఈ సంవత్సరపు బాలసాహిత్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా.పత్తిపాక మోహన్ గారు. అతి చిన్న వయస్సులోనే ఒక విశిష్ట పురస్కారం పొందడం వెనుక ఉన్న ఆయన అపార కృషిని, నేపథ్యాన్ని అధ్యయనం చేయాల్సిందే.

డా. పత్తిపాక మోహన్ తన రచనల్లో సిరిసిల్లా మానేరు తీరాన్ని, ఇక్కడి సాహిత్య, కళారంగాలను ప్రముఖంగా ప్రస్తావిస్తుంటారు. చేనేత వెతలపై శోకిస్తుంటారు. సిరిసిల్లా మానేరు రచయితల సంఘం వ్యవస్థాపకులు, ఇటీవల కొత్తగా ఏర్పడిన రాజన్న సిరిసిల్లా జిల్లా సంఘం గౌరవాధ్యక్షులు, నేషనల్ బుక్ ట్రస్టు తెలుగు సహాయ సంపాదకులైన డా.పత్తిపాక మోహన్ కు ఈ సంవత్సరం కేంద్ర సాహిత్య అకాడమీ వారి జాతీయ బాల సాహిత్య విభాగంలో బాల సాహిత్య పురస్కారం రావడం ఉభయ తెలుగు రాష్ట్రాల సాహితీ లోకానికి గర్వకారణం, ఒక స్ఫూర్తి, ఒక ఆనందకరమైన వార్తే. ముఖ్యంగా తెలుగు బాల సాహిత్యోద్యమానికి ఊపిర్లు పోసే కిక్కిచ్చే స్ఫూర్తి దాయకమైన శుభవార్తే. పైగా చెప్పాలంటే ఒక సంచలన విషయమే. నిన్నమొన్నటి వరకు సాహిత్య ప్రక్రియల్లో శీతకన్నుతో చూడబడుతున్న బాల సాహిత్యం ఇటీవలి కాలం నుండి పునర్జీవమైంది. సారవంతమైంది. చైతన్యవంతమైంది. ఎంతోమంది కవులు బాల సాహిత్యం వైపు, బాలల్లో సాహిత్య సృజనల వైపు దారిమళ్లిస్తూ, సాహిత్యాన్ని పరిపుష్టం చేస్తున్నారు. అలా బాల సాహిత్యాన్ని భుజాన మోసుకొని దశాబ్దంన్నర పైనుండి బీజావాపనం చేస్తున్న వాళ్ళలో డా.పత్తిపాక మోహన్ ఒకరు. మోహన్ రాసిన బాలల తాత బాపూజీ బాల సాహిత్య పుస్తకానికి ఈ అరుదైన గుర్తింపు, కేంద్ర సాహిత్య పురస్కారం దక్కింది. ఈ పుస్తకాన్ని డా.మోహన్ జాతిపిత గాంధీజీ 150వ జన్మదినోత్సవాల సంబురాలను పురస్కరించుకొని 2020 ఈ పుస్తకాన్ని అక్టోబర్ 2న విడుదల చేశారు. తాను రాసిన రెండేళ్ళ తర్వాత ఈ పుస్తకానికి మహోన్నతమైన పురస్కారం దక్కడం తెలుగు సాహిత్య లోకానికి, బాల సాహిత్య ప్రక్రియకి ఒక వెలుగు దివ్వెగా నిలిచి పోయిందని చెప్పవచ్చును. డా. మోహన్ పిల్లల కోసమే కాక, తెలుగు సాహిత్యంలో కూడా పలు సాహిత్య ప్రక్రియల్లో వివిధ రచనలు చేసి పురస్కారాలు అందుకొన్నారు. రాశిలోను, వాసి లోను ఉద్దండుడే. మంచి వక్త, వ్యాఖ్యాతగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా పేరు తెచ్చుకొన్నారు. బాల సాహిత్యంలో విశేష కృషి చేసినందులకు కేంద్ర సాహిత్య అకాడమీ వారి బాల సాహిత్య విశిష్ట పురస్కారాన్ని అందుకుంటున్న సందర్భాన్ని పురస్కరించుకొని వీరి గూర్చి పరిచయ వ్యాసం రాస్తున్నాను.

ఈ మేరకు 2022, ఆగస్ట్ 24వ ఈ పురస్కారానికి మోహన్ రాసిన బాలసాహిత్య రచన ఎంపికైనట్లు ప్రకటన రావడం, తెల్లారి అనగా ఆగస్ట్ 25న తెలుగు, ఆంగ్ల దిన పత్రికల్లో ఈ వార్త ముందటి పేజీలో పతాక స్థాయిలో రావడం చూస్తే, మోహన్ బాల సాహిత్యానికి చేసిన అవిరళ కృషికి తగిన ఫలితం జాతీయ స్థాయిలో లభించిందని చెప్పాలి. కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షులు చంద్రశేఖర్ కంబారా (జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత)నేతృత్వంలో ఢిల్లీలో సమావేశమైన జ్యూరీ సభ్యులు అర్హులైన కవులు-రచయితలకు 22 భాషల్లో సాహితీ వేత్తలను ఈ పురస్కారాలకు ఎంపిక జేశారు. ఎంపిక జేసిన రచయితలకు 50 వేల నగదు పురస్కారంతో పాటు, తామ్ర ఫలకాన్ని నవంబర్ 14న జాతీయ బాలల దినోత్సవం రోజున అందజేశారు. డా.పత్తిపాక మోహన్ (51) కవి,రచయిత, బాల సాహితీ వేత్త, ఈ ప్రాంత హన్మాజీపేట వాస్తవ్యుడైన జ్ఞాన పీఠ అవార్డు గ్రహీత డా.సినారేని సాహితీ మార్గదర్శకుడిగా ఎంచుకొన్నారు. వీరిద్దరిది తండ్రీ కొడుకుల అనుబంధంగా అమరి పోయింది. అంతేకాక వారితో అపారమైన అనుబంధం, వారితో శిష్యవాత్సల్యం ఉంది.

అంతేకాక సిరిసిల్లా తొలి నవలాకారుడు పెరటి చెట్టు జి. రాములు, తొలి కథారచయిత గూడూరి సీతారాం, సీనియర్ కవులైన కనపర్తి, జక్కని వెంకట్రాజం, డా. వద్దేపల్లి కృష్ణ, నిజాం వెంకటేశం, జూకంటి జగన్నాథం, బహుభాషావేత్త డా.నలిమెల భాస్కర్ లతో సహా ఉమ్మడి జిల్లాకు చెందిన అలిశెట్టి ప్రభాకర్ తదితర కవులు, వారి సాహిత్య ప్రభావం డా.మోహన్ మీద ప్రగాఢంగా ఉంది. డా.మోహన్ రాజన్న సిరిసిల్లా జిల్లా కేంద్రమైన సిరిసిల్లాలో 5-1-1972న చేనేత కుటుంబంలో పత్తిపాక గంగూబాయి, లక్ష్మీరాజం పుణ్యదంపతులకు పెద్ద కుమారునిగా జన్మించారు. వీరికి ఒక తమ్ముడు ముక్తేశ్వర్, ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. తమ్ముడు పత్తిపాక ముక్తేశ్వర్ పత్తిపాక గ్రాఫిక్స్ ను నెలకొల్పి కవులు, రచయితల బుక్స్ డిటీపి చేస్తుంటారు. వీరి తాత పత్తిపాక శంకరయ్య గారు తొలితరం పేరు మోసిన పురోహితులు. వాస్తు, జ్యోతిష్య పండితులు. తాత గారి ప్రభావం మనువడైన మోహన్ మీద పడింది. తాత శంకరయ్యగారు వేదాలు కంఠత: భట్టీ పెట్టారట. మోహన్ విద్యాభ్యాసం సిరిసిల్లాలో ప్రాథమిక స్థాయి నుండి డిగ్రీ వరకు కొనసాగింది.

1987లో హైస్కూల్ ఫైనల్ పదవ తరగతి, 1987-79 వరకు ఇంటర్మీడియట్, 1989-1992 వరకు సిరిసిల్లాకు సమీపంలోని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. సిరిసిల్లా ప్రభుత్వ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నపుడు బాల మోహన్ సాహితీ కళారంగాలపై ఉన్న మక్కువను, ప్రతిభ, చురుకుదనం గ్రహించి, అప్పటి ఉపాధ్యాయుడు టంకసాల దేవదాస్ రావు గారు పంద్రాగస్టు వందుగకు మైక్ ఇచ్చి మాట్లాడించి, పోత్సహించారు. 1993-95లో ఎంఏ తెలుగు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పూర్తిచేసిన మోహన్, అదే విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి పూర్తి చేశారు. తదుపరి తెలుగు పండిత శిక్షణను 1997లో పూర్తి చేశారు. తెలుగులో గజల్ ప్రక్రియ అనే అంశంపై 1998-2001 మధ్యలో ఆచార్య తంగెడ కిషన్ రావు పర్యవేక్షణలో సిద్ధాంత పరిశోధన మూడేళ్ళ రికార్డ్ స్థాయి వ్యవధిలో పూర్తి చేశారు. ఈ పుస్తకం అచ్చులోకి రావాల్సి ఉంది.

వీరు నేషనల్ బుక్ ట్రస్టులో తన 35వ ఏట 2007లో సహాయ సంపాదకులుగా చేరారు. అంతకు ముందు రెండు చోట్ల ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ గా పని చేసి అనుభవం గడించారు. 1998-2001మధ్య ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సిరిపూర్ కాగజ్ నగర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా మూడేళ్ళ కాలం పనిచేసినపుడు వీరికి ఆదిలాబాద్ లో నివసిస్తున్న డా.సామల సదాశివతో వారి సాహిత్యంతో సన్నిహిత పరిచయం ఏర్పడింది. వారి ఉర్దూ భాషతో, ఉర్దూ సాహిత్యంతో, గజల్ ప్రక్రియతో పరిచయం జరిగింది. దాని ఫలితమే










నవంబర్ 14న బాల సాహిత్య పురస్కారం అందుకుంటున్న డా॥ పత్తిపాక మోహన్



ప్రముఖుల సమక్షంలో డా॥ పత్తిపాక మోహన్ వివాహ మహోత్సవం



కుటుంబ సభ్యులతో...

గజల్ ప్రక్రియపై సిద్దాంత పరిశోధనను పూర్తి చేశారు. తదుపరి నాగారం ప్రాఠశాలలో 2001 నుండి 2007 వరకు టీచర్ గా ఆరేళ్ళ పాటు పనిచేశారు. కరీంనగర్ జిల్లా యువజన పురస్కారాన్ని 1987లో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి విశిష్ట యువజన పురస్కారాన్ని 1997లో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకొన్నారు. ఇలా వీరి సాహిత్య పయనం, ఉద్యోగ జీవితం బండికి రెండు చక్రాల్లా ఉల్లాసంగా సాగింది. ప్రముఖ సాహితీవేత్త సిఎస్. రాంబాబు గారన్నట్లుగా వృత్తి, ప్రవృత్తి కలిసిపోయి వీరి సాహితీ జీవిత గమనానికి పురోగతి బాటలు పడ్డాయి. ఈ అవకాశాలు మిగతా రచయితలకు అరుదేనని చెప్పాలి.

2007లో నేషనల్ బుక్ ట్రస్టులో (ఎన్ .బి. టి)సంపాదకులుగా చేరాక, బాల సాహిత్యం పైనే ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు. ఈ ట్రస్టులో వివిధ సాహితీ ప్రక్రియలపై ప్రచురణలు, సృజనలు, ఇతర సాహితీ కార్యకలాపాలున్న ప్పటికినీ, 20 శాతంగా బాల సాహిత్యంపై కేంద్రీకృతం చేసే పనిలో భాగంగా, మోహన్ బాల సాహిత్యాన్ని పూర్తిగా ఆకలింపు జేసుకొని, బాలసాహిత్య రచనలు, దీని కార్యకలాపాలపై, ముఖ్యంగా కార్యశాలలు, కొత్త రచనల విస్తృతిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. అలా ఎన్.బి.టీలో చేరాక 15 ఏండ్లలో బాల సాహిత్యంపై రచనలు, అనువాదాలు చేశారు. ఇతర రచయితల చేత చేయించారు. కార్యశాలలు నిర్వహించారు. ఆదాన్ ప్రదాన్ కింద పుస్తకాలు వెలువరించ డంలో కీలక పాత్రను పోషించారు. దాదాపుగా 280 కి పైగా బాల సాహిత్య కార్యశాలలు నిర్వహించి, ఎంతోమంది బాలల్ని బాల సాహిత్య రచయితలుగా తీర్చి దిద్దడమే కాకుండా, ఎంతోమంది సాహిత్య కారులు బాల సాహిత్య రచయితలుగా ఎదగడానికి స్ఫూర్తిని ఇవ్వడంలో సఫలీకృతులయ్యారు. ఎంతోమంది బాల సాహిత్యంలో ఉద్దండులున్నప్పటికినీ బాల సాహిత్యానికి కేరాఫ్ గా డా. పత్తిపాక మోహన్, వారి కార్యకలాపాలు ప్రముఖంగా కనబడుతున్నాయి. ప్రస్తుతం డా.మోహన్ స్ఫూర్తితో ఎంతో మంది పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్లు బాల సాహిత్యాన్ని తమ భుజాల మీద వేసుకొని సరికొత్త రచనల ఉత్పత్తికి శ్రీకారం చుట్టడంతో, బాల సాహిత్య విస్తృతి ఒక ఉద్యమంలా గత దశాబ్ద కాలం నుండి పుంజుకొని నడుస్తున్నది.

వీరి వివాహం సిద్దిపేట వాస్తవ్యులైన చందన గారితో 2004లో ఫిబ్రవరి 11 వ తేదీన జరిగింది. డా.సినారే పెళ్ళి పెద్దగా హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. శ్రీమతి చందనామోహన్ గారు హిందీ సాహిత్యంలో ఉన్నత స్థాయికి ఎదిగారు. ప్రభుత్వ హిందీ పండితురాలుగా డిఎస్సీ ద్వారా ఎంపికై ఉద్యోగం పొందారు. ప్రస్తుతం హిందీ సాహిత్యాంశంపై పిహెచ్ డి చేస్తూ ముగింపు దశకు చేరుకొన్నారు. వీరికి కూడా బాల సాహిత్యమంటే మక్కువే. భర్తకు తగ్గట్లుగా మసలుతూ, మోహన్ నిర్దేశిత సాహిత్యగమన నౌకా యానానికి తెరచాపలా వ్యవహరిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. అభ్యుదయ్ శంకర్, అనిరుధ్ శంకర్. పెద్దబ్బాయి 10వ తరగతి,రెండో అబ్బాయి 8వ తరగతి చదువుతున్నారు. తమ్ముని ఇద్దరు కూతుర్లను తన వద్దే ఉంచుకొని చదివిస్తున్నారు.

గతంలో కేంద్ర సాహిత్య అకాడమీ వారి బాల సాహిత్య పురస్కారాల్ని తెలంగాణాలో 2021లో భూపాల్ , 2017లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన కీ.శే.వాసాల నర్సయ్య గార్లు అందుకొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి కలువకొలను సదానంద, డి.సుజాతాదేవి, రెడ్డి రాఘవయ్య, దాసరి వెంకటరమణ, చొక్కాపు వెంకటరమణ, నారంశెట్టి ఉమామహేశ్వర రావు, బెలగం భీమేశ్వరరావు, కన్నెగంటి అనసూయలు అందుకొన్నారు.

## డా. పత్తిపాక మోహన్ రచనలు

వీరి రచనలు ఇంటర్మీడియట్ చదువుతున్న పుడే మొదలయ్యాయని చెప్పవచ్చును. 1986-1994 మధ్య నుండి వీరి సాహితీ ప్రస్థానం మొదలైందని చెప్పవచ్చు. కవిత్వం, వ్యాసాలు, కథలు, అనువాదాలు, సంపాదక త్వాలు కలిపి వీరి రచనలు 30 కి పైగా ఉన్నాయి. వీరి రచనల్లో చాలా మటుకు స్థానీయ, ప్రాంతీయ ముద్రతో పాటుగా, తెలంగాణా సంస్కృతి, అస్తిత్వవాదాలు ఎక్కువగా ప్రతిబింబిస్తాయి. తెలుగు ప్రాచీన సాహిత్యాన్ని ఔపోసనం పట్టి, ఇంతకు ముందున్న తొలితరం బాల సాహితీవేత్తల రచనలు అధ్యయనం చేసి, వడబోసి పలు రచనలు, వ్యాసాలు కూడా రాశారు. ఎంత ప్రాచీనమో, అంత ఆధునిక సాహిత్యంలో కూడా వీరి రచనలు కనబడుతుం టాయి. మోహన్ ఇంతవరకు రాసిన రచనలను పరిశీలిస్తే వీరు బాల సాహిత్య రచనలతో పాటు. బాల సాహిత్య అనువాదాలు, సమాంతరంగా వివిధ ప్రక్రియల్లో సాహిత్య రచనలు, పలు పుస్తకాలకు, సంకలనాలకు, ప్రత్యేక సంచికలకు సంపాదకులుగా వ్యవహరించారు. వివిధ పత్రికలకు బాల సాహితీ వేత్తల పరిచయాలతో పాటు, బాల సాహిత్యేతర వివిధాంశాలపై సాహిత్య వ్యాసాలు రాశారు. బాలల కథలు రాశారు, రాస్తున్నారు. ఇతర రచయితల కవిత్వాలు, రచనలు, బాల సాహిత్య రచనలకు, సంకలనాలకు వందలాదిగా ముందు మాటలు, అభినందనలు రాశారు. ప్రస్తుతం వీరి కథలు ధారావాహికంగా నమస్తే తెలంగాణాలో, బాల సాహితీవేత్తల పరిచ యాలు నవతెలంగాణా ఆదివారపు సంచికలలో వస్తున్నాయి. ఎన్ బి టీలో పలు భాషలకు చెందిన సంపాదకులు ఉండటంతో వారితో ఇతర భాషల సాహిత్యాంశాల తీరు తెన్నుల గూర్చి తెలుసు కోవడానికి, అధ్యయనం చేయడానికి వీలైంది.

సినారే లాగా వందలాది సాహిత్య సభలకు, సత్కారాలు, సన్మానాల సభలకు గత రెండు దశాబ్దాల పై నుండి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ చక్కటి పేరును తెచ్చుకొన్నారు. సినారే కుటుంబానికి ఆత్మీయుడిగా, సుశీలా నారాయణరెడ్డి ట్రస్టులో గౌరవ ట్రస్టీగా కొనసాగుతున్నారు. దేశ, విదేశాలలోని పలు ప్రాంతాలను పర్యటించి, అక్కడి ఆదాన్ ప్రదాన్ లను, బాల సాహిత్యంతో పాటు ఇతర ప్రక్రియల సాహిత్యాన్ని ఆకలింపుజేసుకొన్నారు. వీరు బ్యాంకాక్, శ్రీలంక, మెక్సికో అంతర్జాతీయ బుక్స్ ఫెయిర్స్ కు ఎన్ బిటీ ద్వారా హాజరయ్యారు. గత దశాబ్దం కిందట ఆచార్య ఎన్.గోపి సృష్టించిన నానీల పర్వంలో ఆ సమయంలో కీలక పాత్రను పోషించారు. సిరిసిల్లా, కరీంనగర్ ప్రాంతాల నుండి యాభైకి పైగా కవులు నానీల సంకలనాలు తీసుకొని వచ్చారు. నానీ కవిత్వాల ఆవిష్కరణలు, సమాలోచనలు, సదస్సులకు, దశాబ్ది ఉత్సవాలకు మోహన్ తన వంతు సహకారాన్ని అందించారు. చేనేత కేంద్రమైన సిరిసిల్లాలో చితికి పోయిన చేనేత వృత్తి, చేనేత కార్మికుల ఆత్మహత్యలు, వారి అష్ట కష్టాలపై స్పందించి పలు రచనలు చేశారు. అనంతపురం ప్రముఖ కవి రాధేయ మగ్గం బతుకులా, కునారిల్లి పోతున్నచేనేత రంగ దుస్థితులపై, పలు రచనలు చేశారు. బంతిపూలు, కౌముది సాహిత్య వ్యాసాలు, పచ్చబొట్టు నానీలు, చేనేత వృత్తి కడగండ్లపై కఫన్ నానీలు, చేనేత కార్మికుల ఆత్మహత్యలపై తెగినపోగు అనే దీర్ఘకవిత రాశారు. గుజరాత్ భుజ్ భూకంపంపై స్పందించి ఒక దీర్ఘ కవిత రాశారు. 1994లో మిత్రులతో కలిపి ఖడ్గధార, సముద్రం అనే కవితా సంకలనాలను ప్రచురించారు.

2006లో సిరిసిల్లాకు చెందిన సాహితీ ఆధ్యాత్మిక వేత్త భాగవత రత్న గుజ్జె భూమయ్య స్వామి సంక్షిప్త జీవిత చరిత్రను 2006లో రాశారు. సిరిసిల్లా తొలి తరం నవలా రచయిత జి. రాములు పెరటి చెట్టు నవల, కథలు, అలాగే సిరిసిల్లా తొలితరం కథారచయిత గూడూరి సీతారాం కథలు 2004లో అచ్చులోకి తెచ్చారు. సీతారాం గారు బతికి ఉన్నప్పుడు సాహితీ జీవిత స్వర్ణోత్సవాల ఉత్సవాలను జనవరి, 11,2005లో కూడా మారసం వారి అధ్వర్యంలో నిర్వహించడంలో కీలక పాత్రను పోషించారు. వీరి అభినందన సంచికలను అచ్చులోకి తెచ్చారు. కరీంనగర్ ప్రముఖ చరిత్ర, సాహిత్య కారులు డా.మలయశ్రీ గారు తన సిద్ధాంత గ్రంథమైన కరీంనగర్ జిల్లా తెలుగు సాహిత్య చరిత్ర గ్రంథం ఆవిష్కరణోత్సవ సభ 24-10-1997 లో కరీంనగర్ రైస్ మిల్ హాల్ లో నవ్య సాహిత్య పరిషత్తు ఆధ్వర్యంలో జరిగింది. డా.సినారే, డా.పాకాల యశోదారెడ్డి, జువ్వాడి గౌతమరావు తదితరులు ముఖ్య అతిథిలుగా రాగా, యువకవిగా ఉన్న మోహన్ గారు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. పైగా డా.కె.రాజన్న శాస్త్రి, కాలువ మల్లయ్యలతో పాటు పుస్తక సమీక్షా ప్రసంగాలు చేసి తన ప్రతిభను చాటుకొన్నారు.

కరోనా మహమ్మారి పీడిత కాలం నాటి పరిస్థితులను వివరిస్తూ మే 2020లో లాక్ డౌన్ కవిత్వాన్ని అచ్చులోకి తెచ్చారు. పిల్లల కోసం మన కవులు అనే చిరు పుస్తకాన్ని 2005లో ప్రచురించారు. ఇందులో వార్తా దినపత్రికలో వీరు ఒక శీర్షికను నిర్వహించి ప్రాచీన కవులెందరినో పరిచయం చేశారు. అంతేకాక బాల సాహిత్య కవులను కూడా ప్రస్తుతం నవతెలంగాణ, ఇతర ఆదివారపు సంచికల్లో పరిచయం చేస్తున్నారు. నిరంతర సాహితీ వ్యాసంగాలు చేస్తూ, పుస్తకాల ప్రచురణలతో సాహితీ లోకంలో తనదైన ఉనికిని చాటుకొంటున్నారు. వీరి బాలసాహిత్యం న్యూఢిల్లీ ఎన్ బి టిలో ప్రవేశించాకే పూర్తి స్థాయిలో అనగా 2007 నుండే మొదలైందని చెప్పవచ్చును. చందమామ రావే అనే బాలగేయాలను 2009,2014,2019లలో ప్రచురించారు. వెన్నముద్దలు బాలగేయాలు, ఆకుపచ్చనిపాట హరిత బాల గేయాలు, ఒక్కేసి పువ్వేసి చందమామ అనే పేరిట బాలల బతుకమ్మ గేయాలు, ఆ ఆ ఇ ఈ బాల లయలు 2019లో అచ్చులోకి తెచ్చారు. తన మార్గదర్శకులైన పిల్లల కోసం సినారే గారి కథను2020లో అచ్చులోకి తీసుకొని వచ్చారు. డిసెంబర్ 2020లో జో అచ్యుతానంద జోజో ముకుందా అనే పుస్తకంలో జోల పాటలు, బాలగేయాలు, పెళ్ళి పాటలు సేకరించి అచ్చులోకి తెచ్చారు. తాను రాసిన గేయాలను ఇందులో చేర్చారు. నడుస్తున్న 2022వ సంవత్సరంలో జయహో బాల సాహిత్యం పేరిట బాలవికాస ప్రగతి పై పరిశోధించి రాసిన 18 విశ్లేషణాత్మక వ్యాసాలు పుస్తకంగా 130 పేజీలలో తెచ్చారు. ఇందులో బాల సాహిత్యం ఎదిగిన తీరు తెన్నులు, నూతనాంశాలపై అధ్యయనం చేసి చక్కటి వ్యాసాలు రాశారు.

## వీరి బాల సాహిత్య సంకలనాలు:

ఈ పుస్తకాలను వీరు సంపాదకులుగానో, సంపాదక మండలి సభ్యులుగానో, సమన్వయ కర్తగానో కనిపిస్తారు. ముఖ్యంగా బాలల కోసం పాటలు, గేయాలు, కథలు, అనువాదాలు, సంపాదకత్వాలు నిర్వహించారు. స్వర్ణ భారతికి బాల భారతి కవితా నీరాజనం అనే పేరిట 1997లో జరిగిన అఖిల భారత స్వాతంత్ర్య స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని 51 మంది బాలబాలికల కవితా సంకలనం, 2013లో పిల్లల కోసం పాటలు,2017లో పిల్లల కోసం పొదుపు కథలు, కతల వాగు, కవితల సింగిడి కథా, కవితా సంకలనాలను 2017లో అచ్చులోకి తెచ్చారు. కేంద్ర సాహిత్య అకాడమీ, సిరిసిల్లా రంగినేని ట్రస్టు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యశాలల ఆధారంగా ఈ రెండు సంకలనాలను తీసుకొని వచ్చారు. 2019లో వానావానా వల్లప్పా అనేడి బాల గేయాల సంకలనం, పర్యావరణం ప్రాతిపదికగా ఆకుపచ్చని ఆశలతో బడిపిల్లల అక్షర సంతకాలు 2019లో మరో బాల సాహిత్య రచయిత గరిపల్లి అశోక్ తో కలిపి అచ్చులోకి తెచ్చారు. సిరిసిల్లాకు చెందిన తొలి తరం బాల కథారచయిత డా.గూడూరి రాఘవేంద్ర గారి (తొలితరం కథారచయిత గూడూరి సీతారాం సోదరుడు) పిల్లల కథలను సహన పరీక్ష పేరుతో అచ్చులోకి తెచ్చారు. ఇవి 1956 కాలం నాటివి. పిల్లల కోసం జాజిరి, జోలపాటలు సేకరించి డిసెంబర్ 2020లో అచ్చులోకి తెచ్చారు. పిల్లల కోసం 18 పుస్తకాలను అనువాదం చేశారు. అవి శాశ్వత మిత్రులు, ముత్తు కలలు,టిప్పు సుల్తాన్ కథ, ఝాన్సీ రాణి కథ, తోకలు, ఆనందీ ఇంద్రధనుస్సు, మంచి మిత్రులు, ఎందుకు, మామిడి పండు పక్షుల కథలు, షీబూకు గంట దొరికింది, కాబూలి వాలా, చంద్రుడు లెక్క మరిచి పోయాడు, సేవకుడైన రాజు, ఏది ఇస్తామో దానిని తిరిగి పొందుతాము, పరమవీర చక్ర మేజర్ సైతాన్ సింగ్ తదితరాలున్నాయి.

పిల్లల కోసం మన కవులు-2005, చందమామ రావే బాలల బతుకమ్మ పాటలు-2009, వెన్నముద్దలు-2016లో అచ్చులోకి తెచ్చారు. తనకు తెలిసిన బాల సాహిత్య రచయితలతో ఆదాన్ ప్రదాన్ కింద

(మిగతా 3వ పేజీలో..)












ప్రముఖులతో డా॥ పత్తిపాక మోహన్.



ఫిబ్రవరి 1, 2015న రవీంద్రభారతిలో అంబల్ల జనార్ధన్ కథలు "మలుపులు" గ్రంథావిష్కరణలో రఘుశ్రీ, డా॥పత్తిపాక మోహన్, బైస దేవదాసు, ఆచార్య కొలకలూరి ఇనాక్, ప్రభుత్వ సలహాదారులు డా॥కె.వి. రమణాచారి, అంబల్ల జనార్థన్, సుధామ,



సెప్టెంబర్ 7, 2018న కరీంనగర్‌లో జరిగిన రేగులపాటి (రంగినేని) లక్ష్మి పిల్లల పండుగ" సభలో డా॥ సామ లక్ష్మారెడ్డిని సత్కరిస్తున్న నేటినిజం సంపాదకులు బైస దేవదాసు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఆకునూరి శంకరయ్య, రంగినేని మోహనరావు, డా॥వి.ఆర్.శర్మ, డా॥ పత్తిపాక మోహన్.



జూన్ 4, 2015న ఎన్.బి.టి. కార్యాలయంలో స్వర్ణలతా నాయుడు రచించిన "జ్వలించిన రాగాలు" "పూలపిట్ట' గ్రంథాల ఆవిష్కరణ సభలో డా॥ పోరెడ్డి రంగయ్య, పి. సుబ్బారావు, వదలి రాధాకృష్ణ, ఆవిష్కర్త బైస దేవదాసు, స్వర్ణలతా నాయుడు, డా॥పత్తిపాక మోహన్, ఆర్.వి.ఎస్.ఎస్. శ్రీనివాస్.



నవంబర్ 29, 2017న తెలుగు సాహిత్య కళాపీఠం అధ్యక్షులు చిక్కా రామదాసుకు సత్కారం చేస్తున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అయాచితం డా॥ ఈటెల సమ్మన్న, కళా జనార్థనమూర్తి, డా॥పత్తిపాక మోహన్, బైసదేవదాసు.




ఆగష్టు 22, 2018న కళాలలిత కళావేదికలో "మణిపూసలు" ప్రక్రియ సృష్టికర్త వడిచర్ల సత్యం ఆత్మీయ అభినందన సత్కార సభలో చిక్కా రామదాసు, డా॥ ఈటెల సమ్మన్న, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ అయాచితం శ్రీధర్, బైస దేవదాసు, డా॥పత్తిపాక, ఏనుగు నరసింహారెడ్డి, సీతాలక్ష్మి,బింగి నరేందర్, చిక్కా దేవదాసు.



నవంబర్ 11, 2019న రవీంద్రభారతిలో తెలుగు సాహిత్య కళాపీఠం 8వ వార్షికోత్సవంలో ప్రసంగిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డా॥కె.వి. రమణాచారి. వేదికపై చిక్కా రామదాసు, బైస దేవదాసు, డా॥పత్తిపాక మోహన్, న్యాయమూర్తి బూర్గుల మధుసూదన్, డా॥ ఎల్లంపల్లి బుచ్చిరెడ్డి, వడ్డేపల్లి కృష్ణ.



మార్చి 29న 2015న హైదరాబాద్‌లోని పద్మశాలి సంఘం సమావేశ మందిరంలో ఉగాది పురస్కార సభలో డా॥పత్తిపాక మోహన్, డా॥ బండ సరోజ, బైస దేవదాసు, కందగట్ల స్వామి. అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షులు జి. శ్రీరామమూర్తి, చిక్కా రామదాసు,

డా॥ పత్తిపాక మోహన్ ఆయా సభలో పాల్గొన్న దృశ్యాలు..



ఆగష్టు 29 2017న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా.. చిత్రటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరాం, జస్టిస్ బి. చంద్రకుమార్, గంగిరెడ్డి, పత్తిపాక మోహన్, బైస దేవదాసు, బిక్కి కృష్ణ, డా॥ ప్రసాదమూర్తి, కాంతికృష్ణ తదితరులు.



మార్చి 31, 2019న హైదరాబాద్‌లోని నేషనల్ బుక్ ట్రస్ట్ సమావేశ మందిరంలో సత్య నీలిమ మొదటి కవితా సంపుటి "రవి కిరణాలు" ఆవిష్కరణలో జి. కృష్ణమోహన్, బైస దేవదాసు, డా॥పత్తిపాక మోహన్, తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డా॥ ఏనుగు నరసింహారెడ్డి, కవయిత్రి నీలిమ దంపతులు, రమాదేవి కులకర్ణి, డా॥ చీదెళ్ళ సీతాలక్ష్మి.



అక్టోబర్ 29, 2015న కర్నాటి లింగయ్య "నానీల పుష్పాలు" కవితల సంపుటి ఆవిష్కరణలో డా॥ పోరెడ్డి రంగయ్య, బైస దేవదాసు, డా॥ ఎన్.గోపి, కర్నాటి లింగయ్య, యస్.రఘు, డా॥పత్తిపాక మోహన్



జులై 1,2016న త్యాగరాయ గానసభలో ఆచార్య ఎన్.గోపి రాసిన "ఓ కవి స్వీయకథ" గ్రంథావిష్కరణలో డా॥పోరెడ్డి రంగయ్య, విహారి, ఆచార్య ఎన్.గోపి, ఆవిష్కర్త డా॥సి. వసుందరారెడ్డి, డా॥పత్తిపాక మోహన్, బైస దేవదాసు, డా॥కె.వి.దీక్షితులు.



డిసెంబర్ 18, 2017న రవీంద్రభారతిలో బైస దేవదాసు, డా॥పత్తిపాక మోహన్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ.




డిసెంబర్ 18, 2016న త్యాగరాయ గానసభలో "వంగాల ఫౌండేషన్ (సేవాసంస్థ)ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య, పద్మశ్రీ డా॥ కె. సాయిబాబుగౌడ్, కె.నర్సింహాగౌడ్, బైస దేవదాసు,డా॥పత్తిపాక మోహన్, డా॥ కళా వెంకట దీక్షితులు, చిక్కా రామదాసు, వంగాల బాలరాజ్‌గౌడ్.



నవంబర్ 5, 2015న ఎన్.అరుణ రచించిన "కొన్ని తీగలు–కొన్ని రాగాలు' కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న డా॥సి. నారాయణరెడ్డి. చిత్రంలో ఎన్.బి.టి. కార్యనిర్వాహణాధికారి డా॥ పత్తిపాక మోహన్, డా॥నీరజ జివ్వాజి, ఓల్గా, కవయిత్రి అరుణ, నేటినిజం సంపాదకులు బైసదేవదాసు, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ అధినేత మద్దాళి రఘురాం.



సెప్టెంబర్ 27, 2018న తెలంగాణ సచివాలయంలో తెలుగు సాహిత్య కళాపీఠం 6వ వార్షికోత్సవ కవితా సంకలనం "కవితాపీఠం" ఆవిష్కరణలో డా॥ఈటెల సమ్మన్న, బైస దేవదాసు, డా॥ తిరునగరి, ప్రభుత్వ సలహాదారు డా॥ కె.వి.రమణాచారి, ఆవిష్కర్త అధికార భాషాసంఘం అధ్యక్షులు దేవులపల్లి ప్రభాకరరావు, డా॥పత్తిపాక మోహన్, చిక్కా రామదాసు, ఆచార్య సూర్య ధనంజయ.




ఏప్రిల్ 26,2018న హైదరాబాద్‌లోని కళాలలిత కళావేదికలో రఘుశ్రీ రచించిన "రత్నదీపాలు" నానీల కవితా సంపుటి ఆవిష్కరణ సభలో బందారుపల్లి రామచంద్రారావు, డా॥ లలితావాణి, డా॥ పత్తిపాక మోహన్, ఆవిష్కర్త డా॥ ఎన్.గోపి, రఘుశ్రీ, రమణ వెలమకన్ని, బైస దేవదాసు, కళా జనార్ధనమూర్తి.



మార్చి 31న హైదరాబాద్ ఇంట లెక్చువల్స్ అసోసియేషన్ వార్షికోత్సవ సభలో "సావనీర్" ఆవిష్కరణలో మోసినా మోబెన్, దారం గంగాధర్, నేటినిజం సంపాదకులు బైస దేవదాసు, అసోసియేషన్ కన్వీనర్ రిటైర్డ్ ఐ.జి. ఆఫ్ పోలీస్ జి.ఎ.రహీం (ఐ.పి.ఎస్) డా॥ పత్తిపాక మోహన్, జనాబ్ సయ్యద్ సలీం, డా॥చెన్న కేశవులు

పలువురి చేత అనువాదాలు చేయించారు. సిరిసిల్లాలో మారసం, రంగినేని ట్రస్టు సహకా రంతో పలు బాల సాహిత్య వర్క్ షాపులు, సభలు నిర్వహించడమే గాకుండా పలు పుస్తక ప్రచురణలు చేయించారు. అలా బాల సాహిత్యపు వెలుగుల్లో డా. కందేపి రాణీప్రసాద్, డా. వాసరవేణి పరశురాం, గరిపల్లి అశోక్ తదితరులు బాల సాహిత్యంపై పిహెచ్ డి పరిశోధనలు చేయడమే కాకుండా,పలు బాల సాహిత్య రచనలు చేసి, తెలుగు విశ్వవిద్యాల యం ద్వారా విశిష్టమైన కీర్తి, ప్రతిభా పురస్కారాలు అందుకొన్నారు.

తెలంగాణా ప్రభుత్వ ప్రాథమిక స్థాయి తెలుగు ప్రాథమిక పాఠ్య పుస్తక సంపాదకుల్లో వీరు ఒకరిగా వ్యవహరించి తన ప్రతిభకు పదును పెట్టుకొన్నారు. జాబిల్లి 1,2,3 తరగతుల తెలుగు పుస్తకాల్లో గేయాలను 2019–20 విద్యాసంవత్సరంలో పాఠ్యాంశంగా చేర్చారు. 2017లో హైదరాబాద్ లో ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన తొలి ప్రపంచ తెలుగు మహాసభలలో కీలక పాత్రను పోషించారు. బాల సాహిత్య కమేటీ సభ్యులుగా వ్యవహరించారు. ఇటీవల డా.సినారే సతీమణి సుశీలా నారా యణరెడ్డి స్మారక పురస్కార సభకు వ్యాఖ్యాతగా వ్యవహరించి, ఈ కార్యక్రమ నిర్వహణలో సినారే కూతుర్లు, కుటుంబ సభ్యులతో ఆత్మీయుడిగా నిలిచారు. బాల భారతి–2, బాలభారతి3, మహారాష్ట్ర లోని 2,3 తరగతుల తెలుగు పుస్తకాలలో గేయాలను 2019–20 పాఠ్యాంశంగా చేర్చారు.

## పురస్కారాలు:

వీరికి సత్కారాలు 23వ ఏట నుండే ప్రారంభమయ్యాయి. వీరికి పలు బాల సాహిత్య పురస్కారాలతో పాటు, బాల సాహిత్యేతర రచనలకు పురస్కారాలు వరుసగా, సమాంతరంగా అందుకోవడం గొప్ప విశేషమే. బాల, సాహిత్య రంగాలలో వీరి దిట్టయని నిరూపించుకొంటున్నారు. 1995 కరీంనగర్ గ్రామీణ కళాజ్యోతి పురస్కారం,1996లోఉమ్మడి కరీంనగర్ జిల్లా యువజన పురస్కారం, 1997లో మరుసటి సంవత్సరమే ఏపి యువ సాహిత్య విశిష్ట పురస్కారం, 2009లో తెలుగు విశ్వవిద్యాలయం వారి కీర్తి పురస్కారం, 2013లో ఇదే విశ్వవిద్యాలయం నుండి బాల సాహిత్య పురస్కారం అందుకొన్నారు. 2017లో డా.వేదగిరి రాంబాబు బాల సాహిత్య పురస్కారం, ఇదే సంవత్సరంలో డా. నన్నపనేని మంగాదేవి బాల సాహిత్య పురస్కారం, మధురకవి మల్లవరపు జాన్ కవి సాహిత్య పురస్కారం, డా.చింతోజు బ్రహ్మయ్య బాలమణి బాల సాహిత్య వికాస పురస్కారం, రాజన్న–సిరిసిల్లా జిల్లా వేడుకల సాహిత్య పురస్కారం, 2018లో అంగల కుదురు సుందరాచారి సాహిత్య పురస్కారం, డా. తిరుమల శ్రీనివాసాచార్య సాహితీ పురస్కారం, బాల గోకులం వారి బాల నేస్తం పురస్కారం, 2019లో బాల బంధు కవిరావు బాల సాహిత్య పురస్కారం, సాంస్కృతిక బంధు సారిపల్లి కొండల రావు జన్మదిన పురస్కారం, శ్రీమతి మంచిపల్లి సత్యవతి స్మారక బాల సాహిత్య పురస్కారం, బాల బంధు సమతారావు బాల సాహిత్య పురస్కారం, శ్రీమతి శకుంతలా జైని తొలి బాల సాహిత్య పురస్కారం, మైగిఫ్ట్ యువ సాహిత్య పురస్కారం, తెలంగాణా సాహిత్య కళా పీఠం వారి కాళోజీ బాల సాహిత్య పురస్కారాల్ని అందుకొన్నారు. మోహన్ సాహితీ ప్రతిభలను గుర్తెరిగిన తెలంగాణా సారస్వత పరిషత్ వారు శాశ్వత సభ్యత్వం ఇచ్చి గౌరవించారు. వీరు పలు పోటీల విజేతల ఎంపికలో జ్యూరి సభ్యులుగా వివిధ సంస్థల పక్షాన వ్యవహరించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

### కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం పొందిన బాలల తాతా బాపూజీ బాలల పుస్తకం గూర్చి....

బాలల తాత బాపూజీ అనే పేరిట ఈ పుస్తకం జాతిపిత మహాత్మాగాంధీ 150వ జన్మదినోత్సవాలను పురస్కరించుకొని సిరిసిల్లా–మారసం 63 వ పుస్తకంగా అచ్చులోకి తెచ్చారు. ఇది ఒక దేశభక్తి రచన. కులమతాలకు అతీతమైనది. దేశం ఇటీవల స్వాతంత్ర్య వజ్రోత్సవాలను ఘనంగా జరుపుకొంది. ఈలాంటి సందర్భంలో ఒక చక్కటి రచన రావడం దేశానికే శుభ సూచకం. జాతీయ సమైక్యతకు, సమతా భావనలకు, జాతీయ సాంస్కృతిక విలువల పునరుద్దరణకు ఒక చక్కటి బాటగా ఈ పుస్తక రచన నిలిచిందని చెప్పాలి. బాపూజీ చరిత్రను బాలల కోసం సచిత్రకంగా 68 పేజీలలో రాశారు. ఇందులో రెండు భాగాలుగా విభజించి రాశారు. ఒకటి గేయాలుగా, మరొకటి గేయకథగా తీర్చి దిద్దారు. సిరిసిల్లా మానేరు రచయితల సంఘం ఆధ్వర్యాన అచ్చులోకి గాంధీజీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2,2020 సంవత్సరంలో విడుదల చేశారు. ముఖ చిత్రాన్ని ప్రముఖ యువ చిత్రకారుడు దుంద్రపల్లి బాబు వేయగా, లోపలి చిత్రాలను ప్రముఖ చిత్రకారులు కూరెళ్ళ శ్రీనివాస్ సందర్భోచితంగా వేశారు.

ఇందులోని గేయాలను, కథలను నేటి నిజం పత్రికలో తొలుత ప్రచురించారు. గేయాలను, కథను తుమ్మూరి రామోహనరావు, గరిపల్లి అశోక్, మనాశర్మలు, డా.మురహరి రావు ఉమాగాంధీ, బాల సాహితీ వేత్తలు డా.సిరి, డా.వడ్డేపల్లి సంధ్య తదితరులు పరిశీలించి, ఈ పుస్తకం రావడంలో తగినంతగా సంపాదక సహకారాన్ని అందించారు. ఈ పుస్తకాన్ని ప్రముఖ సాహితీ వేత్త, వదాన్యులు నిజాం వెంకటేశం గారికి అంకితం ఇచ్చారు. ఇందులో వీరు పది బాపూజీ గేయాలను 20 పేజీలలో వేశారు. మహాత్ముడు, జోతలు, సత్యాగ్రహ ఆశ్రమాలు, మౌని, నీ మార్గం, రామరాజ్యం, స్వాతంత్ర్య సారథి, బాలల తాతా, సూర్యుడు, ప్రంద్రాగస్టు శీర్షికలతో రాసిన గేయాలు పిల్లల హృదయాలను హత్తుకొనేలా ఉన్నాయి. **అమరుల త్యాగాలన్నీ/సార్ధకమై నిలిచిన రోజు/ గాంధీ మంత్రం ఫలించి/స్వేచ్ఛ విరిసిన రోజు॥** అని పంద్రాగస్టు గూర్చి అలతి అలతి పదాలలో బాలలకు అర్థమయ్యే రీతిలో రాశారు. **ఈ విశాల విశ్వంలో/ ధృవతారవు గాంధీ తాత/ అస్తమించని సూర్యుడివి/నువ్వేగా గాంధీతాత॥** అంటూ గాంధీజీ దేశ స్వాతంత్ర్య సముపార్జనకు చేసిన కృషిని స్వాతంత్ర్య సారథి అనే గేయంలో తేట తెల్లంగా చెప్పారు. **సత్యమునే పలకాలని/చాటించి చెప్పినావు/ ఆచరించి చూపించి/ ఆదర్శం అయ్యావు॥** అని అదే నీ మార్గం అనే గేయంలో గాంధీజీ ఆశయాలను, ఆచరణలను చక్కగా విడమరిచి చెప్పారు. 41 పేజీలలో గాంధీజీ గేయకథను రసరమ్యంగా గానామృతంగా అల్లడం చూస్తే, బాల సాహిత్యం ఆబాల గోపాల సాహిత్యంగా వర్థిల్లుతుం దనడానికి ఇంకేమి నిదర్శనం కావాలని అనిపిస్తుంది? నాలుగు మినీ పంక్తులలో ఈ గేయ కథ హనుమాన్ చాలీసా తో పాటు ఎంఎస్ రామ రావు గారు పాడిన బాలల రామాయ ణం లాగా ఉందని చెప్పడం అతిశ యోక్తి కాదు. **వాయువ్య భారతాన/ ఉదయించెను భానుడు/ భరత జాతికే పితగా/ వెలిగిన అసమానుడు.॥** వీరి గేయ కథల్లోని వాక్యాల కూర్పులో భావార్ధాలే కాకుండా, శబ్ద, కవితా సౌందర్యాలు తొణికిసలాడుతాయి. **మనిషిగనే పుట్టినాడు/మనీషిగా మారినాడు/ స్వాతంత్ర్యం సాధించి/ చరితార్థుల చేరినాడు॥** ఇందులోని పంక్తుల్లో నిసర్గ కవితా సౌందర్యంతో పాటుగా, బాపూజీ గూర్చి, ఆయన జీవిత చరిత్ర, స్వాతంత్రోద్యమ చరిత్ర గూర్చి గొప్పగా చెప్పడానికి వారి చరిత్రను ఎంతగా అధ్యయనం చేశారో కనిపిస్తుంది. పిల్లలకు గాంధీజీ ఆదర్శమయమైన జీవితాన్ని, సత్యం, అహింసా విలువలను, మత సామరస్యాన్ని గూర్చి డా. మోహన్ చక్కగా అరటి పండు ఒలిచి చెప్పినట్లుగా చెప్పడం కనిపిస్తుంది. **బడిలోను, గుడిలోనూ/కన్నతల్లి ఒడి లోనూ/సత్య ధర్మ దీక్షలను/ సతతము పాటించెను॥** అని బాల గాంధీజీ ఆశయాల విలువలను చిన్ననాటి నుం డే ఎలా అలవడినాయో అలతి అలతి పదాలలో రసరమ్యంగా చెప్పడం కనిపిస్తుంది. సతతము అనే పదాన్ని వాడి గేయకథకు ఒక మార్మికతను అద్దారు. కథాగమనం హృద్యంగా, రసవేద్యంగా సాగుతుంది. వేసెను చెరగని ముద్రను/ శ్రవణ కుమారుని గాథ/ సత్యమహిమ తెలియజేసె/ సత్య హరిశ్చంద్ర గాథ॥ గాంధీజీ సన్మార్గాన్ని నడవడంలో ఆయనపై పడిన అపూర్వ పౌరాణిక కథల ప్రభావాలను డా.మోహన్ గారు చెప్పడంలో కృతకృత్యులయ్యారు. భాషా పటిమ, అర్థవంతమైన భావం, శబ్ద పద ప్రయోగాలు ఈ పుస్తకంలో కోకొల్లలు గా కనిపిస్తాయి. బాపూజీ జననం, బాల్యం, విద్యాభ్యాసం, చెడు వ్యస నాలకు దూరంగా ఉండడం, లండన్ వెళ్ళి బారిష్టర్ చదువుకోవడం, వివాహం, దక్షిణా ఫ్రికాలో వలస జీవితం, వకాలత్ వృత్తిలో చేరడం, అక్కడి తెల్లవాళ్ళ దురహంకారం, అక్కడి నల్ల చట్టాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు ఉద్యమం నడపడం, స్వదేశంలో స్వాతంత్రోద్యమం నడిపిన తీరు, విజయం సాధించిన తీరు, చివరకు నిర్యాణం వంటివి ఇందులో డా.మోహన్ క్రమం తప్పకుండా చర్చించారు. **జన్మభూమి భరతధాత్రి/ దాస్య శృంఖలాలు అతనిని కదిలించగ తరలి మోపె నిచట కాలు॥** అంటూ **గాంధీజీ స్వదేశాగామన కాంక్షను వెల్లడిస్తాడు. కొల్లాయిని గట్టెను/ చేత కర్ర బట్టెను/ గుండు పిలక రూపం/ గాంధి మార్చుకొనెను॥** అని గాంధీజీ మారిన రూప వేష ధారణ గూర్చి చక్కగా చెప్పడంలో మోహన్ రచనా పటిమ వెల్లడవుతుంది. **నేటికి ఆ మహాత్ముడు/ ఈ నేల మీద పుట్టి/ నూటాయాభై యేండ్లు/ గడిచినాయి చిత్రంగా॥** అంటూ గాంధీజీ 150 వ జన్మదినోత్సవాల సంబురాల విశిష్టతలను వెల్లడిస్తాడు. ముగింపులో ఇలా చెబుతాడు. **తరతరాలకు ఈ స్ఫూర్తి/ కొనసాగాలని కోరుదాం/ జై అందాం అందరమూ/ బతికినన్ని నాళ్ళు॥** అంటూ ఈ విశిష్ట సందర్భాన్ని, ప్రత్యేకమైన సందేశాన్ని అర్థమయ్యేలా వివరిస్తాడు. ఈ అద్భుత రచన ద్వారా బాల సాహిత్యాన్ని చక్కగా పండించిన డా. పత్తిపాక మోహన్ గారు బహుముఖ ధన్యజీవి, ప్రజ్ఞాశాలీ, ఉన్నతమైన ఆదర్శ వ్యక్తిత్వం కల సాదా సీదా కలుపుగోలు మనిషి. వారికి మరిన్ని పురస్కారాలు రావాలని, జాతీయంగానే కాక, అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని, చక్కటి రచనలు చేయాలని కోరుకొందాం.



**-సంకేపల్లి నాగేంద్రశర్మ,**
80748 26371

పుస్తక సమీక్ష

# బాలల తాతా బాపూజీ




భారతదేశ స్వాతంత్ర్య సమరంలో ప్రముఖ పాత్రధారి, సత్యం, అహింస మార్గాలను జీవితాంతం ఆచరించిన మహోన్నతుడు, భారతీయులందరికీ ఆదర్శప్రాయుడు, ప్రజల హృదయాలలో జాతిపితగా కొలువైన మహనీయుడు మహాత్మా గాంధీ. మన కాలంలో నడయాడిన బుద్ధుడిగా పేరొందిన గాంధీ మహాత్ముడి గురించి నేటితరం పిల్లలకు తెలియజేయాలనే సత్ సంకల్పంతో ప్రముఖ కవి, రచయిత, విమర్శకుడు, బాల సాహితీవేత్త, నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియాలో సహాయ సంపాదకులుగా పనిచేస్తున్న డా. పత్తిపాక మోహన్ బాలల తాతా బాపూజీ అనే పుస్తకాన్ని వెలువరిం చారు. గేయాల ద్వారా, కథల ద్వారా విషయాన్ని చెపితే పిల్లలకు సులభంగా అర్థమవుతుంది. అందుకే మన జాతిపిత గాంధీజీ గురించి గేయాలు మరియు గేయ కథ రూపంలో ఈ పుస్తకాన్ని రాశారు రచయిత. అనేక బాల సాహిత్య సంకలనాలు, బాల సాహిత్య అనువాదాలు వెలువరిం చిన పత్తిపాక మోహన్ కలం నుండి అద్భుతమైన రీతిలో వచ్చిన మరో ఆణిముత్యం బాలల తాతా బాపూజీ పుస్తకం. ఇందులో పది గేయాలతో పాటు ఒక గేయ కథ కూడా ఉంది

**మహాత్ముడు అనే గేయంలో .. భూమి మీద నడిచాడు/ మన కాలపు బుద్ధుడు/ ధర్మపథం మార్గమని/ నమ్మి** ఆచరించినాడు.

సత్యం, అహింస, ధర్మమార్గంలో నడిచిన బుద్ధుడిని మనము చూడలేదు కానీ ఆయన మార్గాన్ని అనుసరించిన గాంధీజీ మన కాలపు బుద్ధుడని అంటారు. గాంధీతో పాటు బుద్ధుడిని కూడ పిల్లలకు గుర్తుచేశారు రచయిత. జోతలు గేయంలో.. **భరతజాతి కంతటికి/ స్ఫూర్తి ప్రదాత జోతలివే/ అందుకొనుము గాంధీ తాత అని దేశ ప్రజలకు స్ఫూర్తిగా నిలిచిన గాంధీకి వందనాలు తెలియజేశారు. సత్యాగ్రహ ఆశ్రమాలు గేయంలో.. పోరుబాటలో నడిపించిన/ జన చైతన్య కేంద్రాలు/ మహాత్ముని ఆలోచన/ వర్ధిల్లిన మందిరాలు.** గాంధీజీ నడిపిన సత్యాగ్రహ ఆశ్రమాలు ప్రజల్లో చైతన్యం కలిగించి స్వాతంత్ర్య కాంక్షను రగిలించాయంటారు. మౌనిలో... మానవులను నడిపించగ/ మహిలోన వెలిసితివి. మానవులను సన్మార్గంలో నడిపించడానికి ఈ భూమిపై వెలిసిన మహాత్ముడు గాంధీ అని చెప్పారు. నీ మార్గం గేయంలో... **బాపూ నీ సందేశం/జాతికి అది ఆదర్శం/ ఆచరణం నీ మార్గం/ సదా మాకు ఆదేశం** అని గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు దేశప్రజలందరికి ఆదర్శమని, వాటిని అందరూ ఆచరిస్తే బాగుంటుందని ఆశిస్తారు రచయిత.

**రామ రాజ్యంలో ... పల్లెటూర్లు దేశానికి/ ప్రగతికి పట్టుకొమ్మలు/ పల్లెలు సమృద్ధిగుంటె/ అదే రామరాజ్యం. పల్లెలు దేశాభివృద్ధికి పట్టుకొమ్మలు** అని , పల్లెలు బాగున్నపుడే దేశం అన్ని రంగాలలో ముందుకు వెళ్తున్నదని గాంధీజీ ఆశయాన్ని సంక్షిప్తంగా పొందు పరిచారు. స్వాతంత్ర్య సారథిలో.. నిత్యం మనకు వెలుతురు పంచే సూర్యుడిలాగా స్వతతంత్రోద్యమంలో గాంధీజి విరామం ఎరుగకుండా శ్రమించారు కాబట్టి గాంధీజీని అలుపెరుగని యోధుడవు/ అస్తమించని సూర్యడివి అని పేర్కొంటూ గేయాన్ని రాశారు. బాలల తాతా బాపూజీ/ బంగారు నేత బాపూజీ.. అని పిల్లలకు ఇంపైన, సులభమైన రీతిలో లయాత్మకంగా పాడుకోవడానికి వీలుగా రాశారు బాలల తాతా గేయాన్ని. సూర్యుడు.. అనే గేయంలో సౌరాష్ట్రాన ఉదయించె/ స్వాతంత్ర్య సూర్యుడు. అహింసతో స్వాతంత్ర్యం/ సాధించిన వీరుడు. అహింస మార్గంలో స్వాతంత్రాన్ని సాధించిన గాంధీ సౌరాష్ట్రలో జన్మించాడని గుజరాత్ కు ఉన్న మరో పేరును పిల్లలకు తెలియ జేశారు. **పంద్రాగస్టు గేయంలో... రవి అస్తమించని రాజ్యపు/ సంకెళ్ళు తెంచిన రోజు/ స్వాతంత్ర్య కాంతులతో,** అని మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన ఆగస్టు 15 ప్రాధాన్యతను తెలిపారు. ఆరోజున మనము ఆంగ్లేయుల బానిసత్వపు సంకెళ్ళ నుండి విముక్తి పొంది స్వేచ్ఛా వాయువులను పీల్చామని, మన జీవితాలకు కొత్త వెలుగులు వచ్చాయని అంటారు.

గాంధీజీ పుట్టుక నుండి అతని జీవితంలోని ముఖ్య సంఘటనల ఆధారంగా ఒక గేయకథను కూడా పిల్లల కొరకు అందించారు రచయిత పత్తిపాక మోహన్. గాంధీ చిన్ననాటి ముద్దు పేరు మునియా అంటూ గాంధీజీ జీవితంలోని అనేక బాల్యపు సంఘటనలు గుర్తుచేశారు. ఇంగ్లాండ్ వెళ్లి బారిష్టర్ చదువుకొన్న సంఘటనను, దక్షిణాఫ్రికాలో భారతీయుల హక్కులకై పోరాటం చేయడాన్ని కూడా ఈ గేయకథలో పొందుపరిచారు. స్వాతంత్రోద్యమ ముఖ్య ఘట్టాలైన చంపరాన్ సత్యాగ్రహం, రౌలత్ చట్టం, సహాయ నిరాకరణ ఉద్యమం, స్వదేశీ వస్తువుల వాడకం లాంటి అనేక అంశాలను పిల్లలు సులభంగా చదువుకునులా అలతి అలతి పదాలతో అందించారు పత్తిపాక మోహన్. దేశ స్వాతంత్ర్యం కోసం అహర్నిశలు కృషిచేసిన మహాత్ముడి గురించి భావి తరాలకు తెలియజేయాలని రచయిత తాపత్ర యం ఇందులో కనబడింది.

పిల్లలకోసం కథలు, కవిత్వం, వ్యాసం వంటి విభిన్న ప్రక్రియలలో రచనలు చేసిన పత్తిపాక మోహన్ పిల్లలకోసం బాలల తాతా బాపూజీ పుస్తకంలో గేయాలతో పాటు గేయకథను కూడా పొందుపరిచారు. గత సంవత్సరం గాంధీ జయంతి కానుకగా నేటి నిజం దినపత్రికలో ఈ పుస్తకంలోని గేయాలు ప్రచురించి పాఠకులకు, ముఖ్యంగా పిల్లలకు మరింత చేరువ చేశారు పత్రిక సంపాదకులు బైస దేవదాస్ గారు. గేయాలకు అనుగుణంగా కూరెళ్ళ శ్రీనివాస్ వేసిన బొమ్మలు పుస్తకానికి అదనపు ఆకర్షణ తెచ్చాయి. అందమైన ముఖచిత్రంతో పాటు 64 పేజీలు గల బాలల తాతా బాపూజీ పుస్తకం వెల 75 రూపాయలు.

**ప్రతులకు...**
సెక్రటరీ, మానేరు రచయితల సంఘం,
5–4–47, పత్తిపాక స్ట్రీట్,
సిరిసిల్ల, 505301.



**-కందుకూరి భాస్కర్**
9703487088







ప్రముఖులతో డా॥ పత్తిపాక మోహన్.



# బహుమతి (కథ)

ట్రైన్ మెల్లగా కదిలింది. అందరూ లగేజీ సర్దుకుని ట్రావెల్ మూర్తి చూపించిన సీట్లలో కూర్చున్నారు. ఒకరితో ఒకరు పరిచయాలు చేసుకుంటున్నారు.

అందరూ 20 రోజులు కలిసి ఉండాలి కదా... మాటల్లో పడ్డారు అందరూ. అక్క, బావగారు కూడా వాళ్లతో మాటలు కలిపారు.

వాళ్ల ముఖాల్లో ఆనందం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది,

యాత్రలు చేయబోతున్నామన్న ఆనందంతో. కల్యాణికి తెలుసు ఆ ఆనందం కోసం తను ఎంత తపన పడిందో, ఎంత బాధ పడిందో ...

× × ×

నెల రోజుల క్రితం జరిగినది కళ్ళముందు కదలాడింది.

మార్చి నెల సూర్యుడు అప్పుడే తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఎండలు విపరీతంగా ఉన్నాయి.

ఆరు గంటలు అయింది. కొంచెం వేడి తగ్గిందని మేడమీద ఆరేసిన బట్టలు తీయసాగింది శారద.

ఇంతలోనే తలుపు దబదబమని చప్పుడు. 'ఇప్పుడే కదా, మనవళ్ళని ట్యూషన్ లో దించి వచ్చింది? వచ్చింది ఎవరో?' అనుకుంటూ తలుపు తీసింది. ఎదురుగా తన చెల్లెలు కల్యాణి.

"అక్కా!" అంటూ చుట్టేసింది శారదను కల్యాణి.

"ఏమిటి, ఉరుము లేని పిడుగులా? ఇన్నాళ్లకు గుర్తుకొచ్చిందా ఈ అక్క?" అంటూ మంచినీళ్లు ఇచ్చింది, శారద.

"ఇకనుంచి ఎన్ని రోజులు ఉండమంటే అన్ని రోజులు ఉంటాను, పొమ్మన్నా పోను. ఎందుకంటే, నేను రిటైర్ అయిపోయాను కదా?" అంది కల్యాణి, చిన్న పిల్లలా...

శారద, కల్యాణి – రామారావు, లక్ష్మి దంపతుల పిల్లలు. ఇద్దరినీ ఉన్నంతలో బాగా పెంచారు.

పెద్ద పిల్ల శారద, నిండు కుండలాంటిది .

చిన్నమ్మాయి కల్యాణి, గలగల పారే సెలయేరు. మనసులో ఏమీ దాచుకోదు.

శారదకు ఇంటర్ కాగానే పెళ్లి చేసారు. అల్లుడు గవర్నమెంటు ఉద్యోగి. చక్కగా సంసారం చేసుకుంటుంది. ఆమెకు ఇద్దరు పిల్లలు పాప, బాబు.

కల్యాణి, తను అప్పుడే పెళ్లి చేసుకోనని, చదువుకుంటానని డిగ్రీ పూర్తి చేసి, బీఈడీ కూడా చేసింది. టీచర్ గా ఉద్యోగం సంపాదించుకుంది. అలాగే ప్రేమించి పెళ్లి చేసుకుంది.

ఆ అబ్బాయి మంచివాడే. ఏదో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం. చక్కగా ఇద్దరూ కాపురాలు చేసుకుంటున్నారు అని అనుకున్నారు తల్లిదండ్రులు.

కల్యాణి భర్త యాక్సిడెంట్లో చనిపోయాడు. అప్పటికే బాబు పుట్టాడు.

తల్లి, తండ్రి తమ దగ్గరకు రమ్మన్నా కూడా వెళ్లకుండా బాబుని కష్టపడి చక్కగా పెంచి పెద్ద ఇంజనీర్ ని చేసింది కల్యాణి.

కొడుకు సురేంద్ర తనతో పని చేస్తున్న అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. అడ్డు చెప్పలేదు కల్యాణి .

ఎప్పుడైనా ఉత్తరాలు రాసేది ఆ రోజుల్లో అక్కకి.

ఇప్పుడు ఫోన్ లు వచ్చాక, నెలకు ఒకసారి ఫోన్ చేస్తుంది తప్ప ఎప్పుడూ రాలేదు.

'ఇప్పుడు ఇలా వచ్చిందంటే ఏదో విశేషం ఉండి ఉంటుంది!' అనుకుంది శారద.

"ఏంటి అక్కా, ఏదో ఆలోచిస్తున్నావ్? నాకు ఏదైనా టిఫిన్ చేసి పెట్టవా?" అంది కల్యాణి, అక్కతో పాటు వంటింట్లోకి నడుస్తూ. "ఏంటి అక్కా విశేషాలు?" అంది కల్యాణి మళ్ళీ తానే.

"ఏముంటుంది? ఉదయం ఐదు గంటలకే లేచి కొడుకు, కోడలు, మనుమలకి క్యారేజీలు సర్దడం, మీ బావగారు పిల్లల్ని స్కూల్లో దింపడం, తీసుకురావడం చేస్తారు. సాయంత్రం తనలాగే రిటైర్ అయిన వాళ్లు అందరూ కలిసి సరదాగా కాలక్షేపం చేస్తుంటారు.

పిల్లలకి టిఫిన్ పెట్టి ట్యూషన్ కి పంపించాను తీసుకురావాలి. ఇంకో అరగంటలో!" అన్నది శారద. తీసుకొచ్చి హోం వర్క్ లు చేయిస్తుంది...

రాత్రి 8 గంటలకు కొడుకు రఘు, కోడలు దీప వచ్చారు ఆఫీస్ నుంచి ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు.

"చిన్న అత్తయ్య గారూ, బాగున్నారా?" అని అడిగింది దీప.

"బాగున్నానమ్మా!" అంది కల్యాణి.

'సరే..." అంటూ లోనికి వెళ్ళిపోయింది.

"ఏంటి పిన్నీ విశేషాలు?" అంటూ పక్కన కూర్చున్నాడు, రఘు.

"ఏముంటాయిరా, ఇన్నాళ్లు కష్టపడ్డాను, రిటైర్ అయిపోయాను! అలా యాత్రలు చేద్దామని అనుకుంటున్నాను. అలాగే నాతో పాటు అక్కని, బావగారిని తీసుకెళ్లాలని అనుకుంటున్నాను. ఏమంటావ్ రఘూ?" అన్నది కల్యాణి.

"సరే పిన్నీ!" అంటూ, "ఎంత డబ్బు కావాలంటే అంత ఇస్తాను. టిక్కెట్లు చెప్పు!" అన్నాడు రఘు.

ఆ విషయం అక్కతో చెప్పగానే ఎంత సంబరపడిపోయిందో! బావగారు కూడా, సంతోషపడ్డారు. "ఇన్నాళ్లకు మాకు యాత్రలకు వెళ్లే ప్రాప్తి కలిగింది అన్నమాట!

ఎప్పుడూ మీ అక్క తనను తీసుకెళ్ళమని అంటుంది కానీ నాకే పిల్లల బాధ్యతలు, డబ్బు ఇబ్బందులతో తీసుకుని వెళ్ళడానికి కుదరలేదు. నాకు కూడా అన్నీ చూడాలని ఉంది. రఘు ఆ మాట అనేసరికి నాకు చాలా సంతోషంగా ఉంది!" అన్నారు బావగారు.

అక్క కొడుకు రఘుకి, ట్రావెల్ మూర్తి గారి నెంబరు ఇచ్చి, వారి దగ్గర అప్పటికి శలవు తీసుకుంది కల్యాణి.

× × ×

మరో రెండు రోజుల తర్వాత –

ఆ సాయంత్రం రఘు ఫోన్ చేశాడు.

"పిన్నీ! మా అమ్మా నాన్నలు క్యాంపుకి వెళితే పిల్లల్ని ఎవరు చూస్తారని దీప అంటుంది!"

"అదేమిట్రా, అలా అంటావు? ఒక్క 20 రోజులు మేనేజ్ చేసుకోలేరా?"

"ఏమో పిన్నీ! దీప వద్దని చెప్తుంది!" అని ఫోన్ పెట్టేసాడు రఘు.

నేను మళ్ళీ వాడికి ఫోన్ చేసి, "అదే సమస్య అయితే, పిల్లల్ని మీ మామగారి ఇంటికి పంపించవచ్చు కదా! అక్కడినుంచే స్కూలుకి ట్యూషన్ కి వెళ్తారు. ఊర్లోనే కదా!" అన్నది కల్యాణి.

రఘు ఏమీ మాట్లాడలేదు.

"నిజం చెప్పు! ఈ సమస్య పిల్లలదా? లేకపోతే డబ్బులు అయిపోతాయి అని భయమా?" అని గట్టిగా అడిగింది కల్యాణి.

"నిజమే పిన్నీ! డబ్బులు అయిపోతాయని దీప అంటుంది!"

"అదేమిట్రా మీరు లాస్ట్ ఇయర్ పిల్లల్ని వదిలేసి ఊటీ, కొడైకెనాల్ అంటూ తిరిగేరు కదా! అప్పుడు డబ్బులు ఖర్చు కాలేదా? మీ అమ్మానాన్నల కోసం ఖర్చు పెట్టడానికి అంత ఆలోచిస్తున్నావా? నీకు అదే సమస్య అయితే నేనే ఆ డబ్బులు పెట్టుకుంటాను. ఎన్నోసార్లు నేను ఇబ్బందిలో ఉంటే మీ నాన్నగారు సాయం చేశారు. కనీసం ఇలాగైనా వాళ్ల ఋణం తీర్చు కుంటాను. డబ్బులు నేనే పెట్టుకుంటానులే!" అని ఫోన్ పెట్టేసింది.

నాలుగు రోజుల క్రితం తనింట్లో జరిగిన విషయం గుర్తుకొచ్చింది. తను యాత్రలకి వెళ్తానని కొడుకు తో చెప్తే మౌనంగా ఉన్నాడు.

రెండు రోజులు పోయాక, "డబ్బు దండగ!' అన్నాడు.

కోడలు గదిలోనుంచి, చేతులతో వద్దని సైగలు చేస్తోంది.

దాంతో కోపం వచ్చి, "నువ్వేమీ మీ డబ్బులు ఇవ్వనక్కర్లేదులే, నా దగ్గర ఉన్న డబ్బులతో వెళతాను!" అని కరాఖండిగా చెప్పింది.

అక్క కొడుకు రఘు అడగ్గానే ఒప్పుకుంటే చాలా మంచి వాడని అనుకుంది, కానీ వాడు కూడాపెళ్ళాం చాటు మొగుడే అని నిరూపించుకున్నాడు.

అక్కకు, బావగారికి తనతోపాటు టిక్కెట్లు బుక్ చేసింది.

ఇంత ప్రేమాభిమానాలతో పెంచిన పిల్లలు ఇలా తయారవుతారని కలలో కూడా అనుకోలేదు.

'ఇప్పుడు ఈ జనరేషన్ లోనే బంధాలు ఇలా ఉంటే ముందు ముందు ఇంక ఎలా ఉంటారో!' అనుకుంది కల్యాణి.

అక్కకు, బావగారికి ఈ విషయం తెలిస్తే ఎంత బాధ పడతారు? అందుకే వాళ్ళకి చెప్పలేదు.

తమ కొడుకు, కోడలు యాత్రలకు డబ్బులు ఇచ్చారని అనుకుంటున్నారు అందుకే ఆనందంగా ఉన్నారు. అన్ని విషయాలు గలగల మాట్లాడే తను ఈ విషయాన్ని మనసులోనే దాచుకుంది.

ట్రూప్ లో అందరూ కలిసి చప్పట్లు కొట్టటంతో ఈలోకంలోకి వచ్చింది, కల్యాణి.



–కొల్ల పుష్ప
8374596096

## ప్రయత్నానికి వెయ్యిముఖాలు

నిన్నటి నిప్పురవ్వే
నింగిని వెలిగించే సహస్ర కిరణుడు
నిన్నటి నీటి చుక్కే
ఘనీభవించిన హిమపన్నగం.

నిన్నటి గాలి తెమ్మెర
ఎన్నటికైనా జీవనాధారం
నిన్నటి మబ్బు తునక
నేలనూ నింగినీ కలిపే మహాసముద్రం.

విత్తనమెప్పుడైనా చిన్నదే
అది మహా వృక్షాలను కంటున్నది
అణువెప్పుడైనా ఉన్నదే
అనంతాకాశాన్ని ప్రభవిస్తుంది.

అడుగులు తడబడుతున్నాయని
శైశవానికి తెలియదు
ఆరిపోతానేమోనన్న దిగులు
దీపానికుండదు.
వాడిపోతాననే బాధ
చిగురుకుండదు
ప్రయత్నం వెయ్యిముఖాలు
ప్రపంచం కోటిరకాలు.



– ఆచార్య మసన చెన్నప్ప
సెల్:98856 54381

## బంతి పూవు

చిన్న చిన్న గుంది
బంతి పూల చెట్టు
విరగ కాసింది
అందమొలుకునట్టు

కోయ బోతుంటే
పూవు నవ్వింది

నన్ను కోయకుండా
ఆటలాడుకొమ్మంది

జీవించు కాలం
అతి స్వల్పమైనా
మెరిసేటి అందంతో
మనసు దోచుకుంది.

ఆడవారి తలలో
దేవునికి దండలో
ప్రతి అలంకరణలో
రంగులు పూస్తుంది.

మానవత్వమున్న
మనిషి మెడనందు
మాలగా మారితే
జీవితం ధన్యమౌనంది



–ఆవుల చక్రపాణి యాదవ్
9963350973

## తెలుగు గజల్

సమాజమే విద్యాలయం..చదువుకోరా తమ్ముడా!
అనుభవాలే ఉపాధ్యాయులు..తెలుసుకోరా తమ్ముడా!

శిఖరం ఎక్కాలనివుందా..పడదోసే ప్రబుద్ధులుంటారు
గమనించి అడుగులు వేసి..అందుకోరా తమ్ముడా!

మనిషిని మనిషే నమ్మడు..జంతుజాతిలో ఇదిలేదు
ప్రతి మనిషిలో ఇద్దరుంటారు..చూసుకోరా తమ్ముడా!

స్వచ్ఛమైన మనసువుంటే..మెచ్చేవారు లేరులేరూ
తేనెపూసిన కత్తులుంటాయి..చూసుకోరా తమ్ముడా!

మేడిపండు మేలిమిలా ఓదేవా..ఉంటారోయి కొందరు
తరచిచూడగా కుళ్ళు కుతంత్రాలు..గ్రహించుకోరా తమ్ముడా!



– బూర దేవానందం
8143589789

## గానసభలో 'వాకాటి' జయంతి



నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీదేవి, జనార్ధనమూర్తి

ద్విభాషల్లో వాకాటి పాండురంగారావు ఉద్దండులని రాష్ట్ర అధికార భాషా సంఘ చైర్‌పర్సన్ మంత్రి శ్రీదేవి అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో సోమవారం ప్రముఖ జర్నలిస్ట్.. రచయిత వాకాటి పాండురంగారావు జయంతి సభ గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీదేవి మాట్లాడుతూ ప్రముఖ ఆంగ్ల తెలుగు దిన పత్రికల్లో సంపాదకవర్గ ప్రముఖుల్లో ఒకరుగా గుర్తింపు పొందారన్నారు. వాకాటి గొప్ప రచయితగా అభివర్ణించారు. కవి చిక్కా రామదాసు, గానసభ ఉపాధ్యక్షుడు కళా సుబ్బారావు, మేధా, ఆనందలహరి, మల్లం రమేష్ పాల్గొన్నారు.

## పాడుచేయకు ప్రకృతిని..!

పాడవుతుంది
ప్రజలు చేసిన పనికి
ప్రకృతి మాత..!
మోడువారిపోతుంది
మనుషులు చేసే మోసాలకు
పచ్చని తల్లి...!!

ఆత్యాశలకు పోయి
అంతం చేస్తున్నరు..!
స్వార్థానికి పోయి
సర్వనాశనం చేస్తున్నరు.!!

మేలు చేస్తున్నామని
కీడు తలబెడుతున్నరు..!
చాలు అనుకుంటూనే
పాడు చేస్తున్నారు..!!

రాను రాను జీవుల
మనుగడ కష్టమవుతుండెను..!
కాలుష్యకోరల్లో చిక్కుకొని
కాటికి చేరువవుతుండెను..!!

ఇన్ని అనర్థాలకు
కారణంబు మానవులే..!
ఇట్టి దమనకాండకు
ఆద్యులు ఆ నరులే..!!

మానవా... ఓరి మానవా
ఇకనైనా మారవా
మట్టుబెట్టుట మాని
ప్రకృతిని కాపాడుటకు
ముందు నడువుము..!
మనుగడ కొనసాగించుటకు
బాటలు వేసుకొనుము..!!



–పసుల. శంకర్
9542181301

## ఆనందమయ జీవనం

అద్భుతమైనది ఆనందం
ప్రతి సంఘటన మంచిగా
అన్వయించుకుంటే పొందేది
ఆనందమే?

మంచి తలపులే
మనిషికి ఆనందం?
బాధలకు చివరి
మజిలీ ఆనందమే?

అది గుర్తెరిగి ప్రవర్తిస్తే
ప్రతిక్షణమూ ఆనందమే?
ఇలలో దొరకనిది
ఊహల్లో దొరుకుతుంది?

మనసు ఉరకలేస్తుంది
ఆనందాన్ని పంచుతుంది?
మంచిగా ఆలోచించాలి
ఆనందంగా జీవించాలి?

–దేవరకొండ లక్ష్మీనారాయణ
8985869475

## బతుకు జట్కా బండి

ఆకాశమంతా భూమ్మీద
చీమలాంటి ప్రాణమున్న
బతుకు జట్కాబండి జీవితాలెన్నో...!

రెండు మనసుల కలయికతో
ప్రాణము పోసుకున్న రూపానికి
నేల కాగితముపై అడుగులేస్తున్న మడుగులకి
మెతుకు గూటికి ఆపదలెన్నో..!

చిక్కనైన మీసాల సంసార సాగరంలో
బాధ్యతల పడవ నడిపించడం
అంతులేని అవరోధాల అలలను దాటడం
ఈర్ష్య ద్వేషాల సునామీలను తట్టుకోవడం
ఆకలి కేకల కెరటాలను భరించడం
గుండెగుడిసెలో ఫెనం ఖాళీగా మిగలడం
గాలిపటపు ఆశలదారాన్ని ఒంటరిగా మిగల్చడం
కూలీలేక ఖాళీకడుపు

పేగుకు కన్నీళ్లు రాల్చడం మాములే..!

ఒడిదుడుకుల ప్రయాణంలో
సాఫీగా సాగలేని ముఖచిత్రాల తోటలో
అటుపోటుల బంధాల నడుమ గాయమై
లేపనం లేని వీధివిచిత్రపు ఆటలో
కల్మషపు బాధల సంతకాలన్నీ కూడా
బతుకు జట్కాబండి పాఠాలే..!!

కష్టం నష్టం ఎదురైనా
ఆశ నిరాశాలు అడ్డైనా
నీలో చెమట దారలతో శ్రమించు
ఉప్పెనలా నీ మనస్సు తేజస్సును ప్రేరేపించు
నీ కాంక్షను లక్ష్యాన్ని సంధించు
శ్రమయేవ జయతితో శిఖరం అధిరోహించు
సిరాక్షరాలతో శిలపై చరిత్ర రాయవచ్చు



–డాక్టర్ పగిడిపల్లి సురేందరు
8074846063

## గురు బోధనం.

వేకువ దారిని జూపగ
చీకటి పరదాలు చీల్చి చెలిమిని గూర్చున్
తేకువ బ్రతుకుకు నేర్పుచు
రేకులు విచ్చిన సుమముగ రేపిక మార్చున్.

గురువే యద్భుతమౌచును
తరువుగమారినక్షణమునదక్కునుఫలముల్
వరముగ నిలుచుచు సతతము
పరమును శిష్యాళికిడుచు పరమాత్ముండౌ

చదువుల సారము పెంచుచు
మృదువుగ బోధన సలుపుచు మేధావులుగన్
పదవుల విలువను జెప్పుచు
కదనముగెలువగనడుపును కారుణ్యముతో

ప్రత్యక్ష బోధన తోడను
నిత్యము జెప్పిన చదువుకు నిఖిలములోనన్
పత్యము లేదని నుడవగ
ముత్యముతీరుగమెరియుచుముదమునుగూర్చున్

సారము నిచ్చెడి విద్యను
ధారణ జేసెడి విధంబు తపసుగ జెప్పున్
ప్రేరణగ నిల్చి పోవుచు
వేరుగ మనతో జతపడు వేత్తగ గురుడున్

మూర్తిగ ముందుకు నడుపును
నార్తిగ జెప్పును సకలము నందరికెపుడున్
పూర్తిగ విద్యను నేర్పుచు
స్ఫూర్తిని నింపును మనకును పుణ్యాత్ముండై



–డా॥సముద్రాల శ్రీదేవి
9949837743

## ఆశ నెరవేరేనా?

ఆకాశంలో చందమామను
మిలమిలలాడే తారలను
భువికి తీసుకురావడం
మనిషికి సాధ్యపడేనా?

పరిమితమైన జీవితంలో
అపరిమితమైన కోరికలు
సుఖశాంతుల నిస్తాయనుకోవడం
సరియైన దృక్పథమేనా?

ఆకాశానికి నిచ్చెన వేస్తూ
అసహనానికి బారులుతెరుస్తూ
ప్రశాంతంగా జీవించాలనే
ఆశ నెరవేరేనా?

సుఖాలకై తారట్లాడుతూ
తీరని కోరిక అనే మరీచిక వెంటపడి
జీవితాన్ని అడవి కాచిన వెన్నెల చేసుకుంటే
జన్మకు సార్థకత చేకూరేనా?

క్షణిక సుఖం కోసం
చెడు కర్మలను ప్రోత్సహిస్తే
శాశ్వతమైన ఆనందం దక్కేనా?

కదిలే వంతెనపై కాలు పెట్టి
పాము నోట్లో పాచికైతే
జీవితపరమార్థం నెరవేరేనా?

సంద్రం ప్రశాంతంగా లేకుంటే
నౌకాయానం సాధ్యమేనా?

అశాంతితో రగిలితే
అందని ద్రాక్ష సుఖం అందేనా?
ఆనంద హిత వచనాలతో
దివ్యాస్త్రాలను ఎక్కుపెట్టి
అసురశక్తులను జయించి
శాంతి మంత్రాలను జపిస్తే
జీవనయానం సుఖవంతమవుతుంది



–పిల్లి హజరత్తయ్య,
9848606573

## అక్కా చెల్లెల్లు (కథ)

గోపాలపురం అనే ఊరిలో రాముడు,సీత అనే దంపతులు ఉన్నారు. వారిది నిరు పేద కుటుంబం. వారికి ఇద్దరు పిల్లలు. వారి పేర్లు లక్ష్మీ, కవిత. తల్లిదండ్రులు కవిత ను గారాబంగా చూసేవారు. లక్ష్మి ని చీటికీ మాటికి తిట్టేవారు. బడిలో లక్ష్మి కవిత కంటే బాగా చదివేది.కవిత బాగా చదివినట్లు నటించేది. వీరు ఇద్దరు ఒకే తరగతి చదువుచున్నారు. ఉపాధ్యాయులు మాత్రం లక్ష్మి నే మెచ్చుకునేవారు. ఈ విషయం తెలియని తల్లిదండ్రులు కవితనే మెచ్చుకునేవారు.

ఇంటి దగ్గర తల్లిదండ్రులు లక్ష్మి తో పనులు చేయించేవారు. కవితకు మాత్రం చిన్న పని కూడా చెప్పేవారు కాదు.ఇంటి పనులు చేస్తూనే,లక్ష్మి పెండింగ్ లేకుండా ఉపాధ్యాయులు ఇచ్చిన హోమ్ వర్క్ పూర్తి చేసి బడిలో మంచి పేరు తెచ్చుకునేది.కవిత హోమ్ వర్క్ సరిగా చేయకుండా ఉపాధ్యాయుల చేత ఎప్పుడూ తిట్లు తినేది.

పదో తరగతి పరీక్షల ఫలితాలలో లక్ష్మి స్కూల్ ఫస్ట్ వచ్చింది. గ్రామ ప్రజలు ఉపాధ్యాయులు, అధికారులు అందరూ లక్ష్మి ని మెచ్చుకున్నారు. చాలా బహుమతులు కూడా వచ్చాయి. కవిత ఫెయిలయింది. తల్లిదండ్రులు అప్పటినుండి ఇద్దరు బిడ్డలను సమానంగా చూడడం మొదలుపెట్టారు. కవిత సప్లిమెంటరీ పరీక్షలో పాస్ కావడానికి లక్ష్మి ఇంటి దగ్గర ప్రతి రోజు కోచింగ్ ఇచ్చింది. ఇప్పుడు కవిత కూడా పాస్ అయ్యింది. ఇద్దరు అక్కా చెల్లెల్లు చాలా సంతోషించారు.



–తీగల సాత్విక
8వ,తరగతి

## మొండి ధైర్యం.

రాలుతున్న చదనములన్ని నిశ్శబ్దాన్ని
ఎదలో నింపుకొని భువిపైన
మట్టిని ముద్దాడుతున్నాయి .
జోరుగా జారుతున్న కన్నీటి దుఃఖాన్ని
దిగమింగుకొని తరువు తనువును విడుస్తున్నాయి.
ఇన్నాళ్లు కొమ్మకు తోడైఉన్న పచ్చని పత్రాలన్నీ...
దిగులుగుండెతో వీడ్కోలు పలుకుతున్నాయి.
తనను తాకిన పర్ణములను హద్దుకొని
పుడమితల్లి చేతులతో ఓదార్పు సంతకం చేస్తుంది.

దలములో దాగిన ఆకుపచ్చని జ్ఞాపకాలన్నీ ఆవిరైనా..
ఆశలన్నీ గాలిలో కొట్టుకుపోయినా...
కాలంతో నిశ్శబ్ద యుద్ధం జరుగుతూనే ఉంది.
ఏదో సాధించాలన్న తపన.
ఎందరికో ఆశ్రయం ఇవ్వాలన్న ఆలోచన.
ఆకాశంలో చిందరవందరగా
పరుచుకున్న మేఘాల్లా..

మదిలో కొన్ని ఆలోచనపర్వాలు గూళ్ళు కట్టుకొని
కాలంవైపు చూస్తూనే ఉన్నాయి.
పయోధరములన్ని పోగేసుకున్న తన ఆశల
స్వప్నాలను చినుకుల రూపంలో
దారపోస్తాయ నినమ్మకం.

కాలానికి కూడా క్షమాగుణం
ఉంటుందనేది సత్యం.
మోడులా మారిన మ్రాను..
మొండి ధైర్యాన్ని కోల్పోలేదు.
ప్రతి వసంతం ఈ కష్టాల జాతరే.
అయిన చెదరని సంకల్పం.
ఎండిన కోరికల తరువుల నుండి
మరోకొత్త బతుకుచిత్రం
కన్నీటి బొట్లలా రాలినచోట..
మళ్ళీ కొత్తకళలతో తనువంత పచ్చదనం.
నిండైన ఆకుపచ్చని
అమ్మతనంతో.



–అశోక్ గోనె
9441317361

## ముందుకు....

ముళ్ల కాలిబాటలు
బురదమయ దారులు
కంకరలుదేలిన గుంతల రోడ్డులు
అప్పుడప్పుడు హాయిగొల్పే హైవేలుఏదైనా
పిల్లగాలి జోలలో,టోర్నడోల జోరులో
ఆకుల చాటు కొమ్మలాఊగిపోవల్సిందే
సాగిపోవల్సిందే ముందుకు
వేసవి వేడి నిట్టూర్పులు
జడివానల కుండపోతలు
చలి గాలుల పంజాదాడులు
ఋతుకాలాల గాలాలేవైనా
మబ్బులు క్రమ్మిన,సౌర తుపానులు ఎగజిమ్మినా
రోదసి ఒడిలోఅచల ఆకాశంలాఉండిపోవల్సిందే

సాగిపోవాల్సిందే ముందుకు
దుఃఖమయ లఘు క్షణాలు
బాధలుప్పెంగే నిముషాలు
నువ్వులు పువ్వులయ్యే ఘడియలు
పండగలా గడిపే రోజులు
ఆనందమయ వసంతాలుఏవైనా
గాలి కెరటాలకైనా,లావా విస్ఫోటకాలకైనా
సముద్రంలా గంభీరంగా
నిలిచి ఉండిపోవల్సిందే
సాగిపోవల్సిందే ముందుకు
మునుముందుకు మనిషి.



–నల్లగొండ
83094532179

## వాలిపోతున్న శ్రమ

కారణాలేమైనా కథాసారాంశమంతా
చివరాకరుకు చిత్రంగా మాత్రం ఒకటే ....
అంగబలం అర్థబలం విజ్ఞానం
రాజకీయం కలిసికట్టుగా కాకపోయినా
వారి వారి స్థాయిలలో పోరాడుతూ
అడ్డగిస్తుంటే అసువులు తాకట్టుపెట్టి
దాడి చేస్తే దక్కిన శ్రమ ఫలితం .....

అధికార మత్తులో జోగుతున్న వారికి
అవతలి వారి కష్టాలు నష్టాలు
కంటికి ఆనవు ... కరుకు గుండెకు
చేరవు .... కనికరం చూపవు .....

ఒకప్పుడు అంగబలంతో
వంగబెట్టి లొంగదీసుకుని
దాస్య జీవితాలను దఖలు
పరిచారు ... తరాలతరబడి ....

ఆకలికి పేగులు కదులుతుంటే
కూలి డబ్బుల్లో బేరం పెట్టి
కష్టానికి తగిన ప్రతిఫలాలు అందకుండా
కాలాన్ని కట్టడి చేశారు ....

అధికార పక్షమో ... ప్రతిపక్షమో
అప్పుడు...ఇప్పుడు.... పేదోడికి
చదువులు దక్కకుండా పెద్దోళ్లంతా
కలిసి కట్టుగా ఒక్క మాట మీద
నిలబడుతున్నారు ....

రెక్కలు ముక్కలు చేసుకుని
కాయ కష్టంతో కలో .. గంజో ..
తాగుదామనుకుంటే ....గమ్మత్తుగా
గవర్నమెంటే మత్తులో ముంచేసి ....
చిల్లి గవ్వలను సైతం లాగేసుకుని ....
కుటుంబాలను వీధిన పడేస్తున్నారు ....

సంక్షేమ పథకాల పేరుజెప్పి
సదరుకుంటున్న స్వార్థపరులు
సోమరితనాలకు వారసులను చేసి ...
దారి కాచి దండుకుంటున్నారు ....

కార్పొరేటు కల్చర్ లో పుట్టి పెరిగి
కలర్ కాగితాలలో కట్టబెట్టిన
సత్తా లేని సరుకులకేమో..
ధరలు నిర్ణయించుకునే
ధరావత్తుల అధికారాలప్పుజెప్పి ....

పేరుకు రైతే రాజంటారు కానీ
పెత్తనము మాత్రం అప్పుచెప్పరు
మద్దతు ధరలకు ముద్రవేయరు
బ్రతుకనీయరు? బ్రతుకు నీయరు?



–నగునూరి రాజన్న
8332963129

## కాకి కోకిల ఒకటి కాదు

మనుషుల్లో ఇద్దరు ఒకటే ఉన్నా
పోలికల్లో ఒకే రకంగా ఉన్న

మనుషులు మాత్రం మనసుల్లో
బ్రహ్మాండమైన తేడా ఉంటుంది

నేడు మనిషి స్వార్థపు వలయంలో చిక్కుకొని
తనే ఘనుడు అనుకుంటున్నాడు

విలాసాల లోగిలిలో మైమరిచిపోతున్నారు
మంచిని ఎప్పుడూ తుంగలో తొక్కారు

తూర్పున ఉదయించే సూర్యోదయాన్
ఆపాలని ప్రయత్నిస్తూనే ఉన్నాడు

అయినా అతని ప్రయత్నాలన్నీ
సూర్యుని ముందు దిగదుడు పై

మానవ ప్రయత్నాన్ని వంచనకు గురవుతున్నారు
మనిషిని మనిషి గుర్తించడం లేదు

జీవన విలువలకు తిలోదకాలు
మనిషి నిరంతరం ఏదో ఆరాటపడుతున్నాడు
చివరికి ఎండమావులు లాంటి జీవితంలో

నిన్ను కదిలించినా కదిలించబోయే
ప్రతి అక్షరానికి జేజేలు పలుకు



– సిహెచ్ ఆంజనేయులు
7702537453

## నానీ

ప్రపంచమంతా
వెలివేసింది
ఓదార్చింది
మిత్రుని పలుకు!

ఆత్మహత్య ఆలోచనను
తరిమేసింది
ఒక్కక్షణం
ఓదార్పు!

కష్టాల కడలిలో
దొరికింది
ముత్యాలమూట
ఓదార్పుపలుకులై!

ఒత్తిళ్లను
జయించింది
ఓంకారమంత్రమై
సతి ఓదార్పు పలుకు!

పారిపోయింది
భవిష్యత్తుపై అభద్రతాభావం
ఓదార్పు
ఔషధంతో!

కురిసింది
ఓదార్పు వర్షం
సకారాత్మక
ఆలోచన మెరిసింది!.

చీకటిని చూసి
భీతిల్లాను
ఓదార్చింది
అమ్మ చల్లని స్పర్శ!



–చంద్రకళ. దీకొండ
9381361384

## ఆ రాగమెలా నడిపిస్తుంది?

ఎన్నిసార్లు చెప్పినా
కోయిల నిన్నటి రాగమే పాడుతోంది
ఇది శిశిరానికి వెక్కిరింపో !
వసంతానికి పలకరింపో !!

ఎక్కడినుంచి వచ్చిందో
దేన్ని సరిచేద్దామని
గొంతువిప్పిందోగాని
ఎంత వద్దన్నా
నిన్నటి రాగమే పాడుతోంది

సర్లే ...ఏ రాగమైతేనేం
రాగానికి పాతేమిటి ? కొత్తేమిటి ?
నువ్వెంచుకున్నరాగం
ఎన్ని హృదయాలను కదిలించింది
నువ్వాలపించిన గీతం
ఎన్ని ప్రశ్నలను మొలకెత్తించింది
నువ్వెత్తుకున్న పాట
ఎందరి మెదళ్ళను మెలిపెట్టిందన్నదే ప్రశ్న

అయినా...తడిలేని రాగం
మనసునెలా పులకింపజేస్తుంది ?

ఏ భావనాలేని రాగం
ప్రశ్నలనెలా మొలకెత్తిస్తుంది ?
ఏ అర్థంలేని రాగం
ఆలోచనలనెలా రగిలిస్తుంది ?
చలింపజేయని రాగం
ఆశల వసంతాలనెలా పులుముతుంది ?
ఆత్మచైతన్యంలేని రాగం
నిస్తేజంగావున్న సమాజాన్ని
కొత్తవెలుగువైపెలా నడిపిస్తుంది ?



-ఎన్.నరేశ్ చారి
9701334516

## గ్రహణం విడిచిన వే ళ

రాహు కేతువుల మధ్య చిక్కిన మానవుడు
వర్తమాన జీవితంలో రాహువు కేతువులు
మంచి మనిషిని వంచన చేసి రాహు కేతువుల వలె
దుష్ట సంహారం చేసే ఈ వే ళ
చంద్రుడు గ్రహణం మధ్య
వెన్నెల కూడా ఎరుపెక్కింది
ఆకాశంలో మబ్బుల చాటు చిక్కి న
చంద్రుడు ఎంత మంది రాహులు మిగిలినప్పటికీ
వాళ్ల కంటాలలోంచి నోళ్లలోంచి
తిరిగి తిరిగి వస్తూనే ఉంటాడు
అనేక గ్రహరాజుల మధ్య
అనేకనేక గ్రహరాసుల మధ్య సంచరించే
తెల్లని వెన్నెల అతని జీవితం అపూర్వం

అతను నిత్యం రాత్రి వేళ కాపలా కాస్తాడు
వెన్నెల వెలుగు ఆకాశం శిఖరం పై నుండి
చూపుతూ సాగుతూ నక్షత్రపు పూలతోటలో
విహరి స్తూ నవ్వులను కుమ్మరించే
ఈ గ్రహరాశి ఏ ఎవరైనా
చల్లని కిరణాల చంద్ర మాను
వెన్నెల కురిపిస్తూనే ఉంటాడు
ఎవరు అతని మింగలేరు అతడు
నిరంతరం రాత్రివేళ జయరాజు గాని మిగులుతాడు

నక్షత్రాల రాశులతో చీకటిని పారదోలి
శ్రీ రాజు గాని మిగిలేది
ఈ రే రాజు మాత్రమే అందరికీ తారాలకు
ఆనందాన్ని కురిపించే కలువల ప్రియుడు



-డాక్టర్ సి.హెచ్ ఆంజనేయులు,
7702537453

## మార్చుకో నీ వాళ్ళను..!

సరిదిద్దవోయి
సన్నాసులు ఏరివేసి
సమసమాజం నిర్మించవోయి
సమూల మార్పులు చేసి

చక్కబరుచవోయి
చిక్కిన బతుకులు సరిచేసి

చుక్కానిలా మారవోయి
గరీబోల్లకండగా నిలిచి.

అంధకారం తరమివేయి
అక్షరాలు బోధన చేసి
జ్ఞానాన్ని పంచవోయి
కాలగమనం అంచనావేసి

తప్పటడుగులు మాన్పించవోయి
దిక్సూచిలా ముందు నడిచి
గొప్పడుగులు వేపించవోయి
గురుతర బాధ్యత నీవు మోసి



-పసుల.శంకర్
9542181301

## "స్నేహం కోసం" (కథ)

మర్పడగ అడవిలో ఒక పెద్ద రావి చెట్టు మీద ఒక కాకి, కాకి పిల్ల ఉండేవి. కాకి ఆహారం కోసం బయటకు వెళ్లడంతో కాకి పిల్లకు ఒంటరిగా ఉండడంతో ఏమీ తోచడం లేదు. అందుకే ఎవరితోనైనా ఆడుకుందామని గూడులోంచి బయటకు వచ్చి ఆడుకోవడానికి ఎవరైనా కనిపిస్తారేమో అని అటూ ఇటూ చూసింది. ఎవరూ కనిపించకపోవడంతో నిరుత్సాహపడింది. అంతలోనే పక్కనున్న వేప చెట్టు పైన పావురం కనిపించడంతో ఆనందంతో తన చిట్టి రెక్కలను అల్లాడిస్తూ నెమ్మదిగా ఈ చెట్టు మీది నుంచి ఆ చెట్టు మీదికి ఎగిరి పావురం గూడు ముందు నిలిచి "కా...కా..." అని ఆప్యాయంగా పలకరించింది. దానికి పావురం పిల్ల విసుక్కుంటూ బదులిచ్చింది.

మళ్లీ కాకి పిల్ల ప్రేమగా "తనతో స్నేహం చేయమని, తనతో ఆడుకోమని ఆత్మీయతతో అడిగింది". అందుకు పావురం కసురుకుంటూ "ఛీ!.. ఛీ!..నేను నీతో స్నేహం చేయడమా, నీవెక్కడ, నేనెక్కడ! నేను పాలరాతి రంగులో మిలమిలా మెరుస్తూ ఉంటాను. నీవు కారు నలుపు రంగులో చూడడానికి వికారంగా ఉంటావు. అంతే కాదు ప్రేమికులు, ఇరు దేశాల వాళ్లు సమాచారం కొరకు నన్ను వాడుకుంటారు. రెండు దేశాల మధ్య శాంతి స్థాపనకు గుర్తుగా నన్ను ఒకరికొకరు మార్చుకుంటారు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకు గుర్తుగా నన్ను ఎగురవేస్తారు. అలాంటిది నేను నీతో స్నేహం చేయడమా! వెళ్ళు, వెళ్ళు ఇక్కడి నుంచి" అనగానే కాకి పిల్ల బాధతో వెళ్లిపోతుంది.

అలా మెల్లగా ఎగురుకుంటూ వెళ్తుండగా జామ చెట్టు పై నుంచి చిలక పలుకులు వినబడడంతో ఆనందంతో కాకి చెట్టుపై వాలి రామచిలుకను ఆత్మీయంగా పలకరించి, నాతో స్నేహం చేయమని అడగడంతో, "నేను, నీతో స్నేహం చేయడమా! నేను చిలక పచ్చ రంగులో ఎంతో అందంగా ఉంటాను. అంతేకాదు నా యొక్క ముక్కు ఎరుపు రంగులో ఆకర్షణీయంగా ఉంటుంది. నేను కొరికిన పళ్ళు కమ్మగా ఉంటాయని అందరూ వాటిని లొట్టలేసుకుంటూ తింటారు. అంతే కాదు నేను మనుషుల జాతకాలు కూడా చెప్పగలను. నన్ను కొందరు ఇళ్లల్లో కూడా పెంచుకుంటారు తెలుసా! ఇంకా నేను పొరుగు రాష్ట్ర పక్షిని కూడా" అంటూ బీరాలు పోయింది.అలా ఆ కాకి పిల్ల నిరాశతో వెనుదిరిగి వెళుతుండగా, జమ్మి చెట్టు మీద పాలపిట్ట కనిపించడంతో తన దగ్గరికి వెళ్లి తనతో స్నేహం చేయమని, ఆడుకొమ్మని కోరగా పాలపిట్ట "ఏంటి! నీ అందమేంటి, నా అందమేంటి? నేను పాలపిట్ట రంగులో మెరిసిపోతుం టాను అసలు నన్ను చూసే ఆ రంగుకు ఆ పేరు పెట్టారు తెలుసా! దసరా పండక్కి ప్రజలందరూ నన్ను చూస్తే అదృష్టమని ఊరేగింపుగా వస్తారు. నాకోసం చెట్టు చెట్టుకు గాలించి నేను కనబడగానే ఆనందం తో, సంతోషం తో చప్పట్లు కొడతారు. నేను మన రాష్ట్రపక్షిని కూడా!, వెళ్ళు, వెళ్ళు ఇక్కడి నుంచి" అని దబాయించడంతో కాకి మామిడి చెట్టు కింద ఆడుకుంటున్న నెమలి దగ్గరికి వస్తుంది ఆశగా.

**"చిన్నప్పుడు నీతో స్నేహం చేయనందుకు నన్ను మన్నించు మిత్రమా. అందం, ఐశ్వర్యంతో ఎవరు గొప్పవారు కారని ఎవరి గొప్పతనం వారికుంటుందని నాకు ఈరోజే అర్థమైంది.**

కాకి పిల్ల నెమలి దగ్గరకి వచ్చి నాతో స్నేహం చేయమని వేడుకొనగా, నెమలి "ఏంటి? నేను నీతో స్నేహం చేయడం! పక్షులలోకెల్లా అత్యంత అందమైన పక్షిని నేను. వర్షం పడినప్పుడు నేను పురివిప్పి నాట్యం చేస్తుంటే అందరూ మైమరిచిపోయి చూస్తారు. నా యొక్క ఈకలను పిల్లలు వారి పుస్తకాలలో దాచుకుంటే చదువు వస్తుందని వాటిని చూస్తూ మురిసి పోతారు. శ్రీకృష్ణుడు ఏకంగా నా యొక్క ఈకలను తన తలపై ధరించాడు. అంతేకాదు నేను జాతీయ పక్షిని కూడా అంటూ చెప్పింది" పొగరుగా. దాంతో కాకి పిల్ల అక్కడినుండి వెళ్ళింది బాధగా.

తనతో ఆడుకునే వారు ఎవరు లేరా అనుకుంటూ తనలో తాను బాధ పడుతుండగా అంతలోనే పక్కనున్న జువ్వి చెట్టు మీది నుంచి కుహు కుహు అంటూ కోయిల రాగం వినిపించడంతో కాకి అటువైపు ఎగిరి కోయిలను చూసింది. కోయిల కూడా తనలాగే నల్లగా ఉండడంతో కోయిల నాతో తప్పక స్నేహం చేస్తుందని దాని దగ్గరికి వెళ్లి కా...కా... అంటూ పలకరించింది. అప్పుడు కోయిల విసుక్కుంటూ కూ కూ... కూ... అని బదులిచ్చింది. అయినా కాకి పిల్ల కోయిల పిల్లతో తనతో స్నేహం చేయమని, తనతో ఆడుకోమని ఆప్యాయంగా అడిగింది. అందుకు కోయిల కసురుకుంటూ "ఛీ!... ఛీ!... నీతో, నేను స్నేహం చేయడమా! నేనెక్కడ, నీవెక్కడ? చూడడానికి మనిద్దరం నలుపు రంగులోనే ఉన్న నాలో కృష్ణకళ ఉండడంవల్ల నేను అందంగా ఉంటాను. అంతేకాదు నీ కర్ణ కఠోరమైన స్వరం వింటేనే నాకు చికాకు కలుగుతుంది. నా గానం కోసం జంతువులు, పక్షులు, మనుషులు సంవత్సరమంతా ఎదురుచూస్తారు. మృగరాజు వారి ఆనందం, ఆహ్లాదం కొరకు మా చేత గానకచేరి పెట్టించి విలువైన బహుమానాలు ఇస్తాడు" అంటూ చెప్పడంతో కాకి పిల్ల బాధతో అక్కడి నుంచి వెళ్ళిపోతుంది.

ఇలా ఎవరూ తనతో స్నేహం చేయకపోవడంతో తన గూడు వద్దకు వచ్చి దిగాలుగా కూర్చుంది. అంతలోనే వాళ్ళమ్మ వచ్చి ఆరా తీయగా విషయమంతా చెప్పింది. అప్పుడు కాకి "అంత చిన్న విషయానికే ఇంతలా బాధపడాలా. నేనే నీ స్నేహితుణ్ణి అనుకో. రేపటి నుండి మనిద్దరం కలిసి ఆహారానికి వెళ్దాము ఈ అడవి యొక్క అందాన్ని చూపిస్తూ మార్గమధ్యంలో నేను నీకు ఎన్నో కొత్త సంగతులు, కథలు, కబుర్లు చెప్తాను. జీవితంలో ఎలా ఎదగాలో నేర్పిస్తాను. నిన్ను చాలా గొప్పదాన్ని చేస్తాను. అంటూ ఓదార్చుతూ తనలో ధైర్యం నింపింది.

అలా కాకి పిల్ల పెరిగి పెద్దదైంది. తను సొంత గూడు కట్టుకొని నివసించసాగింది.

అప్పుడు ఒకరోజు చిన్నప్పుడు తాను స్నేహం చేయాలనుకున్న కోయిల కాకి దగ్గరికి వచ్చి కుహు.. కుహు.. అంటూ గౌరవంగా నమస్కరించింది. కాకి కోయిలను తన నివాసానికి సాదరంగా ఆహ్వానించి కుశల ప్రశ్నలు వేసింది. "చిన్నప్పుడు నీతో స్నేహం చేయనందుకు నన్ను మన్నించు మిత్రమా. అందం, ఐశ్వర్యంతో ఎవరు గొప్పవారు కారని ఎవరి గొప్పతనం వారికుంటుందని నాకు ఈరోజే అర్థమైంది. నేను ఎంతో గొప్పదాన్నని చాలా విర్రవీగాను. కానీ నా గుడ్లను నేనే పొదగలేనని నిస్సహాయురాలినని, అసలు మీ అమ్మ పొదగడం వల్లనే నేను పుట్టానని తెలిసాక నా గర్వం అంతా ఎగిరిపోయింది. ఇప్పుడు నేను గుడ్లు పెట్టాల్సిన సమయం వచ్చింది. నీవు అనుమతిస్తే గుడిలాంటి నీ గూడులో గుడ్లు పెడతాను. దయచేసి వాటిని నీ గుడ్లతో కలిపి పొదిగి పిల్లల్ని చేసి నాకు అందిస్తావని అభ్యర్థిస్తున్నాను మిత్రమా" అంది.

అందుకు కాకి "ఆ మాత్రం దానికి ఇంత ప్రాధేయపడాలా! నన్ను మిత్రునిగా స్వీకరించావు అంతే చాలు. కానీ నా పిల్లలతో నీ పిల్లలను స్నేహం చేయడానికి అవకాశం ఇవ్వాలని అభ్యర్థిస్తున్నాను మిత్రమా" అంది. దానికి కోయిల "తప్పకుండా" అనడంతో కాకి కోయిలలు ఒకరికొకరు పాద చలనం చేసుకొని, ఒకరి రెక్క మీద మరొకరు రెక్క వేశారు ఆనందంతో ...



-గంగాపురం శ్రీనివాస్
9676305949

## "మార్పు" (కథ)




ప్రతి రోజూ ఇంటికి లేట్ నైట్‌లో వస్తున్న యువకుడైన తన పుత్రరత్నాన్ని నయాన్నో భయాన్నో వాన్ని దారికి తెద్దామని శత విధాల ప్రయత్నించి విసిగి వేసారి పోయాడు కాశయ్య మేస్త్రీ. పనీ పాట లేక బేవార్సుగా తిరుగుతుంటే వాడి వలన బజార్లో ముఖం దాటేసుకుని తిరిగే పరిస్థితి వచ్చింది కాశయ్యకు. కొడుకుకు చీవాట్లు వేసినప్పుడల్లా, వాని తల్లి భద్రమ్మ అడ్డుపడేది.

"అయ్యా! మనకు లేక లేక పుట్టిన ఒకే ఒక బిడ్డ. వాన్ని ఊరికే చీవాట్లేస్తారెందుకయ్యా! చిన్న పిల్లడు పని వాడే నేర్చుకుంటాడు,అయినా మన మున్నామని గారాబం.."

"నేను సముదాయిస్తానయ్యా!" అని సర్ది చెప్పింది భార్య భద్రమ్మ. మేస్త్రీ కోపానికి వచ్చినప్పుడల్లా భార్య సముదాయించడం, తాను ఊరుకోవడం.. ఇలా జరుగుతూనే ఉంది. కానీ ఆ పుత్రరత్నంలో మాత్రం మార్పు లేదు. పైగా ఈ మధ్య జేబులో నుండి డబ్బు కూడా మాయమవుతోంది. ఇది గమనించిన మేస్త్రీ తన భార్యతో చెబితే కూడా లాభం లేదనుకొని, ఒక రోజు తెల్ల కాగితాలకు కింద మీదా పది రూపాయల నోట్లు కొన్ని పెట్టి 20,30 ఆ కాగితాల కట్టను సగానికి కత్తిరించి తమ ఇంటి ముందు పారేసి మూడో కంటికి తెలువకుండా, ఏమీ ఎరగనట్టు ఉన్నాడు.

ఇలా పారేసిన నోట్లను తన సుపుత్రుడు చూశాడు కానీ, వాడు మారు మాట్లాడకుండా వెళ్లిపోయాడు. వాడిలో చలనం లేదు. మరో వారం తర్వాత వందవి అయిదు నోట్లు వాడి ముందరే చించేస్తున్నాడు, ఊరికే చూస్తున్నాడే తప్ప మారు మాట లేదు. రాత్రిపడుకున్నప్పుడు కాశయ్య "నేను కష్టించి సంపాదించిన డబ్బును అనవసరంగా చించేస్తేనే" అని విచారిస్తూనే చించుతున్నప్పుడు పుత్రరత్నం చూశాడు కాని "అయ్యో అలా ఎందుకు చించేస్తున్నావు నాన్న!" అని కనీసం ఒక్కమాట కూడా అనలేదన్న బాధ మరింత ఎక్కువైపోయింది తనకు. మరునాడు ఉదయం యదా విధిగా పనికి వెళ్లిపోయాడు మేస్త్రి.

ఎప్పటిలాగే పొద్దు నెత్తినొచ్చిన తర్వాత లేచిన పుత్ర రత్నం లేవడంతోనే తన తల్లి దగ్గరికి వచ్చి "అమ్మా! నీకు తెలుసా! నాన్న నిన్న ఐదు వందల రూపాయల నోట్లు చించేశాడు.."

"అదేంటి! నిజంగానా! అయినా మనం చెప్తే వింటాడా? నేను సంపాదిస్తున్న నా ఇష్టం. అంటే ఏం చేస్తాం నాయనా!"

తల్లి అలా చెప్పగానే తనలో ఓ కొత్త ఆలోచన మెరిసింది. "ఖర్చుపెట్టాలన్న, చించేయాలన్న ఒక్క సంపాదించే వాడికే హక్కన్న మాట." అని తన అమ్మతో అంటుంటే

"అవును బిడ్డ! మీ నాన్న ఆ నోట్లు చించితే నీవు అలా ఎందుకు చేస్తున్నావు నాన్న?" అని అడిగావా? అడగలేదు.."అంది భద్రమ్మ.

"అవును అడగ లేదు. నేను సంపాదించడం లేదు కదా..!"

"నీవదనుకున్నావు. కానీ తానేమనుకున్నాడో తెల్సా కష్టపడి చెమట వంచి సంపాదిస్తే తెలుస్తుంది డబ్బు విలువ ఏంటో నీకా కష్టం తెలువదు దాని విలువ తెలవదు. అందుకే నీవేమనకుండా తమాషా చూస్తూ ఉన్నావు అని అనుకొని ఉంటాడు అవునా?" అంది బద్రమ్మ.

అప్పుడు అర్థమైంది నాన్న అలా ఎందుకు చేశాడో. నాకు జ్ఞానోదయం కలిగించడానికేనని వెంటనే తన అమ్మ ఒళ్లో తలపెట్టి "అమ్మా! తప్పైపోయిందమ్మా"! నన్ను క్షమించు.." అని కంటతడి పెట్టుకుంటుంటే

"ఊరుకో బిడ్డా! మీ నాన్న బాధపడేది నీకోసమే రా! నీవు పనిమంతుడవైతే తనకు వెయ్యేనుగులంత బలం. నాన్నను కాదని నేనే ఎన్నో సార్లు నీకు డబ్బులిచ్చ. అందరిలాగా నీవూ సంబరంగా ఉండాలని. కానీ నీవు ఇలా చేయి దాటి పోతావనుకోలేదు నాన్న" అంటూ కొడుకుని సముదాయిస్తున్నది భద్రమ్మ.

నేనిప్పటి నుండి నాన్న చెప్పిన మాట జవ దాటనమ్మ. ఈరోజు నాన్న పని చేసే కాడికి టిఫిన్ బాక్స్ నేనే తీసికెల్తానమ్మా!" అని తన కొడుకు చెప్పగానే తన బాబులో వచ్చిన మార్పుకు సంతోషపడి తన భర్తకు బాక్స్ పెట్టి కొడుకుతో పంపించింది సంబరంగా భద్రమ్మ.

**నీతి: అనుభవిస్తే గాని అసలు విషయం తెలువదంటారు ఇదే మరి.**



-దారం గంగాధర్
సెల్:9848384777

## రేపటి పౌరులం

రెక్కలు కట్టుకుని ఎగిరొస్తాం
నెమలి పింఛంతో ఆడేస్తాం
కోయిల గొంతుతో పాడేస్తాం.

హంసల్లాగా నడిచొస్తాం
చిరుతల్లాగా పరిగెడతాం
సూర్యుడిలా ఉదయిస్తాం.

పున్నమి వెన్నెల అందిస్తాం
ప్రపంచానికే వెలుగిస్తాం
సమత,మమత పెంచేస్తాం.

బాల్యవివాహాలు నిర్మూలిస్తాం
బాల కార్మికతకు కళ్ళెం వేస్తాం
ఉజ్వల భవితకు పునాది వేస్తాం.

దారిద్ర్యాన్ని సమాధి చేస్తాం
కన్నవారి కలలు సాకారం చేస్తాం
క్రమ శిక్షణకు నిచ్చెన వేస్తాం.

అభివృద్ధితో ముందుకు వెళతాం
స్వచ్ఛ భారత్ ను సాధిస్తాం



-కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

## అనాథ మొగ్గలు

నిత్యం చెత్తను సేకరిస్తూ చెత్తలోనే
చెత్తగా కలిసిపోతున్న జీవితాలు
చిదిమేసిన బతుకులు ... అనాథలు !

జానెడు పొట్ట నింపుకోవడానికి
బానెడు మెతుకుల కొరకు పోరాటం
విరిచేసిన కొమ్మలు ... అభాగ్యులు !

వీధికుక్కలతో స్నేహం చేస్తూ
చెత్తకుండీలలో విశ్రమిస్తున్న జీవచ్ఛవాలు
సమాజపు చీత్కారాలు ... అన్నార్తులు !

ధర్మాత్ముల వస్త్రధారణ కొరకు
పుణ్యాత్ముల
అన్నదానం కొరకు నిరీక్షించేవారు
విసిరేసిన సమిధలు .... అనాథలు !

చిరిగిన వస్త్రాలతో
రక్షణలేని పాదాలతో
ఊరు చివర
స్మశానాల్లో తలదాచుకుంటరు
ఆరిపోతున్న దీపాలు...
అభాగ్యులు!



- చంచల రవి కుమార్
8500330700

## పిల్లలెక్కడ ?

చెట్లు
దీవెట్టుకుంటున్నాయి
పిట్టల్లాన్ని
పిల్లలెక్కడని ?

వీధులు
గుండెలు బాదుకుంటున్నాయి
పిల్ల పిచ్చుకలు

కంట బడక

ఇసుక దిబ్బలు
దిగులు మోస్తున్నాయి
లేత పాదాల పాటలు
చెవుల నడక

తూనీగలు
పిల్లలతో కలిసి
పరుగులెట్టడానికి
ఒళ్ళంతా కల్లుజేసుకొని
చూస్తున్నాయి.

ఇంతకీ
పిల్లలు

ఏమైనట్టు
ఎక్కడ వున్నట్టు.

ఇంటింటా
మొబైల్ ఫోన్ల గోడలకు
రెక్కలంటుకున్న
పురుగుల్లా!



-చింతా అప్పలనాయుడు
9441713185

## సహాయం

రామాపురం అనే గ్రామంలో రవి అనే బాలుడు ఉండేవాడు. వారిది చాలా పేద కుటుంబం. రవి చిన్నతంలోనే తన తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారాడు. ఎవరైనా పెడితే తినడం లేకపోతే లేదు. కరోనా సమయంలో లాక్ డౌన్ వలన అతనికి తిండి దొరకని పరిస్థితి ఏర్పడింది.

అప్పటికే ఆతనికి తిండి లేక రెండు రోజులు అయ్యింది. పూర్తిగా నీరసంతో ఉన్నాడు. ఎవరైనా తిండి పెడుతారేమోనని రోడ్డువెంట బయలేదేరాడు. కానీ కరోనా వలన ఎవరు దగ్గరకు రానీయలేదు. తినడానికి కూడా ఎవరు ఏమి పెట్టలేదు.

అలా నడుచుకుంటూ వెళ్తూ ఒక ఇంటి ముందు కులబడుతాడు. ఆ ఇంట్లో ఉన్న లక్ష్మి అనే బాలిక నీరసంగా తమ ఇంటిగేటు ముందు ఉన్న రవిని చూస్తుంది. లక్ష్మి తల్లిదండ్రులు వద్దంటునున్న వినకుండా ఆ బాలిక రవి వద్దకు వచ్చి నీకు ఏమైంది అనిబడుగుతుంది. చాలా ఆకలిగా ఉంది అంటాడు రవి. వెంటనే లక్ష్మి ఇంట్లో నుండి భోజనం, నీళ్లు తెచ్చి రవికి ఇస్తుంది. రవి భోజనం చేసి ఈ రోజు మీరు నాకు ఈ ఆహారం పెట్టకపోతే నేను ఆకలితో చనిపోయేవాడిని. మీకు చాలా ధన్యవాదాలు అని చెప్పి వెళ్తాడు.

కొన్ని రోజుల తర్వాత కరోనా తగ్గిన తర్వాత పాఠశాలలు ప్రారంభం అయ్యాయి. లక్ష్మి బడికి వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు తనను ఒక ఆటో ఢీకొడుతుంది. లక్ష్మికి బాగా దెబ్బలు తగులుతాయి. అప్పుడు అక్కడే ఉన్న రవి వెంటనే 108 కి ఒకరి ఫోన్ తో ఫోన్ చేస్తాడు. దగ్గరలో ఉన్న ఒక హాస్పిటల్ కి లక్ష్మిని తీసుకువెళ్తాడు. కొద్దీ సేపయ్యక లక్ష్మి తల్లిదండ్రులు హాస్పిటల్ కు వస్తారు. మీ కూతురును వెంటనే హాస్పిటల్ కు తీసుకు రావడం వలన బతికించమని డాక్టర్లు చెపుతారు. అందుకు కారణం రవి అని లక్ష్మి తల్లిదండ్రులు తెలుసుకుంటారు.

ఒకప్పుడు తనకు భోజనం పెడితే వద్దన్నామని గుర్తుకు వచ్చి లక్ష్మి తల్లిదండ్రులు సిగ్గుపడుతారు. తమ పాప చేసిన సాయమే దేవుడే రవి రూపంలో వచ్చి కాపాడారని వారు అనుకున్నారు. అప్పటినుండి వారు కూడా ఎవరైనా ఏదైనా అవసరానికి వారి ఇంటికి వస్తే సహాయం చేయడం మొదలు పెట్టారు. లక్ష్మితో పాటు రవిని కూడా మంచి బడిలో వేసి వారిని చదివించారు. అందుకే ఎవరికైనా మనము ఏదైనా సహాయం చేస్తే ఊరికే పోదు. మళ్లీ మనకు తిరిగి ఎదో రూపంలో అందుతుంది.



-బి. లక్ష్మి గణేష్, 9వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. నర్సింహుల పల్లి
పెద్దపల్లి జిల్లా.

## మనోధైర్యం నవోదయమై...

బాధల శిశిరాలతో
పత్రాలను రాల్చుకుంటూ
జీవితం
మోడైపోయినప్పుడు
ఆత్మవిశ్వాసపు చైత్రం
ఆశల పుష్పాలతో
దానిని మళ్లీ...మళ్లీ...
పరిమళింపజేస్తూ వుండాలి
ఆకుపచ్చని ఆనందాలతో
అది పరవశిస్తూ వుండాలి...
ఆశయం
ఒక బిందువై ఆవిర్భవించినా
ముందుకురికే
ఎన్నెన్నో లక్ష్యాల ప్రవాహంతో
అది సింధువై
వుప్పొంగుతూ వుండాలి...
ఆవేదన
గాఢాంధకారపు సుడులై
భయపెడుతున్నప్పుడు
మనోధైర్యం
నవోదయమై
వెలిగిపోతూ వుండాలి...
జీవనయానం
ఆగకుండా
సంకల్ప కిరణాలతో
రాగరంజితమవుతూ
నూతనోత్తేజం
పొందుతూ వుండాలి...



- డాక్టర్ కొత్వాలు అమరేంద్ర
సెల్: 9177732414

## లోగుట్టు (కథ)

దుర్యోధన్ పెద్ద జమిందారు బిడ్డ .పదవతరగతిలో తన తరగతి స్నేహితులందరినీ రమ్మని ఆహ్వానించినా కొంతమంది విద్యార్థులు మాత్రమే వచ్చారు. గదిలోనున్న కంప్యూటర్ నందు వీడియో గేమ్స్ చూడమని ప్రోత్సహించాడు . తొమ్మిదవ తరగతి వరకు ఎవరి గురించీ పట్టించుకోని దుర్యోధన్ ఇప్పుడు స్నేహం అంటూ తరగతి మిత్రులను ఇంటికి పిలిపించి కంప్యూటర్ వాడుకొనడానికి ఇవ్వడం అందరినీ ఆశ్చర్య పరిచింది . అంతేకాదు తనదగ్గరున్న టాబ్ ఇస్తూ" అందులోనూ వీడియో గేమ్స్ వున్నాయి ఆడుకోండి" అన్నాడు

వాళ్ళ తరగతిలో అర్జున్ అనే అబ్బాయి ఉండేవాడు .దుర్యోధనుని ప్రవర్తనపై అనుమానం కలిగింది మిత్రులతో ఆ సంగతి చెబితే " నీదంతా పిచ్చి అనుమానము ."అంటూ చెప్పారు.

లోగుట్టు ఏమిటో తెలుసుకోవాలని దుర్యోధన్ ఇంటికెళ్లి పలుకరించగానే "నీవూ నాకు స్నేహితుడివే .నీకు ఇంకా మీ నాన్న సెల్ ఫోన్ కొనివ్వలేదని నాకు తెలుసు ఇక్కడ ఈ సెల్ ఫోన్ తో వీడియో గేమ్స్ ఆడుకో" అంటూ సెల్ ఫోన్ ఇచ్చాడు.

అప్పటికే దుర్యోధన్ ఇంటికి వచ్చిన స్నేహితులందరూ వీడియో గేమ్స్ ఆడటంలో మునిగి పోయి ఉండటం గమనించాడు. అర్జున్ వీడియో గేమ్స్ చూడకుండా పరిసరాలు గమనించసాగాడు . కాస్సేపు తరువాత "మీరు చూస్తూ వుండండి" అంటూ దుర్యోధన్ వెళ్లడం గమనించాడు. అర్జున్ మెల్లగా దుర్యోధన్ వెళ్లిన వైపు వెళ్ళాడు .అక్కడ మరొక గదిలో దుర్యోధన్ పదవతరగతి పుస్తకములు చదువుతున్నాడు .అసలు సంగతి గ్రహించాడు అర్జున్.

"దుర్యోధన్, నీవు తరగతిలో మొదటి వాడుగా మార్కులు తెచ్చుకొంటే మీ నాన్న ఏం బహుమతి ఇస్తానన్నాడు "

"ఆ సంగతి నీకెలా తెలుసు" అన్నాడు ఆశ్చర్యంగా

"నాకు అన్నీ తెలుసు ముందు చెప్పు"

"బైక్ తీసిస్తానన్నాడు"

"అందుకే కాస్త తెలివిగల వాళ్ళను ఇంటికి పిలిపించి సెల్ ఫోన్ ఇచ్చి వీడియో గేమ్స్ ఆడుకోమంటూ ఇచ్చావని తెలుసు .మరి ఇంకా మీ ఇంటికి రానివారిని ఏంచెయ్యాలనుకొంటు న్నాను"

"అదే ఆలోచిస్తున్నాను" అన్నాడు

జరిగిందంతా దుర్యోధన్ ఇచ్చిన సెల్ ఫోన్ నందు రికార్డు చేసి తన తరగతి మిత్రులకు చూపించిన తరువాత డిలీట్ చేసాడు

దుర్యోధన్ గుట్టు బయటపెట్టిన అర్జున్ ను స్నేహితులు మెచ్చుకున్నారు

దుర్యోధన్ కు అనుమానం రాకుండా ఏదో ఒక కారణం చెబుతూ రోజుకొక్కరు ఇంటికి రావడం మానుకున్నారు.



-ఓట్ర ప్రకాష్ రావు
09787446026

## దివ్యాంగులు

దివ్యమైన ఆలోచనలు గలవారే,
మంచి.. చెడుల తేడాలు తెలిసినవారే,
మానవత్వపువిలువలయోచన గలవారే,
అందరిలా తామూ అందలాలెక్కాలన్న
ఆరాటం గలవారే,
అవనిపై చిందులు వేయాలని ఆశపడేవారే,
దివ్యాంగులు కూడా అమ్మానాన్నల ముద్దుబిడ్డలే
అక్షర జ్ఞానం గల విజ్ఞానవంతులే,
దివ్యాంగులు ప్రేమానురాగాలు
మమతానుభూతులు గల మణి దీపాలే,
జాలి, దయ, కరుణగల
సుగుణాల రాశులే,
దివ్యాంగులుకాదు అంగవైకల్యులు
వారిని చూసి ఎద్దేవా చేసిన వారే
అసలు సిసలైన అంగ వైకల్యులు"



-రాయవరపు సరస్వతి
7989665525

## గాయాల తుంపర్లు

గతం తాలూకు గాయాలు మాననప్పుడు
మనముందెప్పుడు భవిష్యత్తు కనిపించదు
జరిగింది మన మంచికే అనుకున్నప్పుడే
గమ్యం మనముందుంటది
మనకెవరు తోడు రారు ,మనకు కావాల్సింది
మనమే నేర్చుకోవాలి,చేసుకోవాలి
మన మౌనమెప్పుడు ఇతరులకు భయమే కావాలి ,
నిన్నటి తోడు రేపు రాదు బతుకులోను,
భవిష్యత్తులోనూ ,
నీకు నువ్వే పోటీ ,నిన్ను రాపిడి చేసుకునేది నువ్వే ,
ఇతరులు చేయడానికి నువ్ రాయివి కాదు కదా ,
కళ్ళ ముందు కనిపిస్తున్న భవిష్యత్తువి,
రేపు ఇంకొకరికి మార్గదర్శివి

నిన్నటిలా నేడు ఉండదు ,
నేటిలా రేపు ఉండదు ...
నిన్ను ఎవరైనా ముంచాలనే,
తుంచాలనే చూస్తారు,
నువ్వు మాత్రమే మొక్కవై పైకి లెవ్వాలి
నీకంటూ మరో ప్రపంచం ఉంది ,
నిన్ను నువ్వు నిలబెట్టుకో ,
నిన్ను నువ్వు వద్దనుకున్నప్పుడు ఎవరు నిన్ను ఓదార్చలేరు
ఈ ఓదార్పు ఊయల నిన్ను మోయలేదు
చిన్న చిన్న వాటికోసం బంధాల దారాల్ని
బలవంతంగా తెంపేసుకోవడం భావ్యం కాదు కదా...
నిత్యం జరిగే సంఘర్షణలకు మనమే కదా
సమాధానం చెప్పుకోవాలి..

-సౌమ్య వీరబత్తిని
9121654209

## చిరంజీవులు

దేశానికి ప్రాణమిచ్చి
దేహాన్ని లెక్కచేయని చరిత్ర మీది
మీ త్యాగాలను
ఏ తూనికరాళ్ళతో కొలవగలం ?
దేహమొక్కటే
ప్రాణమూ ఒక్కటే ఎవ్వరికైనా
బంధాలూ
అనుబంధాలతో సాగే
బతుకుబండే ఎవరిదైనా
తీగల్లా అల్లుకున్న బంధాలనొదిలి
ప్రాణాల్ని గాలిపటాల్లా
పైకెగరేయడం
నీకంటూ గుర్తింపునిచ్చిన దేహాన్ని
మాతృభూమి మట్టిలోనే కలిపేయడం
మీకుతప్ప ఇంకెవరికి చెల్లు.

మీరెప్పుడూ చెరగని జ్ఞాపకమే
మీరెప్పటికీ స్ఫూర్తి ప్రదాతలే
మీరు తెచ్చిన
స్వాతంత్ర్యపు వెలుగులో
దేశమిప్పుడు దారివెతుక్కుంటుంది
మీరిచ్చిన స్ఫూర్తితోనే
దేశమిప్పుడు నడకనేర్చుకుంటుంది
మీరు నిర్దేశించిన ఆశయాలే
దేశాన్నిప్పుడు శిఖరాగ్రాన
నిలబెడుతున్నాయి
సగర్వంగా నిలబడే దేశ సౌధానికి
పునాది రాళ్లు మీరు
తరాలు మారినా,యుగాలు మారినా
మా గుండెల్లో
చిరకాలం కొలువుండే
చిరంజీవులు మీరు

- ఎన్. నరేశ్ చారి
9701334516

## ఆడపిల్ల (కథ)

అనగనగా రామాపురం అనే గ్రామంలో రామయ్య సీతమ్మ అనే దంపతులు ఉండేవారు వాళ్ళిద్దరికీ ఇద్దరు సంతానం కలిగారు.ఒక బాబు ఒక పాప. బాబు పేరు కన్నయ్య పాప పేరు బుజ్జి రామయ్యకు కన్నయ్య అంటే చాలా ఇష్టం ఉండేది బుజ్జి అంటే ఆడపిల్లని ఇష్టం లేకపోయింది కన్నయ్యను పెద్ద కార్పొరేట్ బడిలో చదివిస్తూ బుజ్జిని మాత్రం చిన్న బడిలో చదివిస్తున్నాడు.

ప్రతి విషయంలో కొడుకును మంచిగా చూసుకొనేవాడు. కూతురును తక్కువ చేసి చూసేవాడు. అలా చూడవద్దని సీతమ్మ రామయ్యకు ఎన్నిసార్లు చెప్పినా అతనిలో మార్పు రాలేదు.

కొన్ని రోజుల తరువాత సీతమ్మ చనిపోయింది. సీతమ్మ చనిపోయాక రామయ్య కన్నయ్యను చాలా బాగా చూసుకుంటూ ఎప్పుడు బుజ్జిని తిట్టేవాడు. బుజ్జి ఒంటరయ్యింది. ఎప్పుడు దిగులుగా ఉండేది. బుజ్జి ఉన్న పరిస్థితి తెలుసుకొని ఉపాధ్యాయులు ఆమెను బాగా చదువుకొమ్మని ప్రోత్సహించారు. తను చదువు మీద ధ్యాస పెట్టింది, ఇంట్లో పని చేసుకుంటూ చదువుకుంటూ ఉన్నంతలోనే సంతోషంగా ఉండేది. అంత పెద్ద బడిలో చదివినా కన్నయ్యకు చదువుమీద శ్రద్ధ లేకపోవడం వలన అతను పదవ తరగతి కూడా పాస్ కాలేకపోయాడు.

కొన్ని రోజుల తర్వాత కన్నయ్య తండ్రిని డబ్బులు అడుక్కొని ఊరు మీద పడి తిరగడం మొదలు పెట్టాడు. తండ్రి ఏమైనా అంటే ఎదురు సమాధానం చెప్పేవాడు. బాగా చదవడం వలన బుజ్జికి ఉద్యోగం వచ్చింది. ఒక రోజు రామయ్య ఇంట్లో జారిపడ్డాడు కాలుకు గాయమైంది. కన్నయ్య అదేమీ పట్టించుకోకుండా ఎప్పటిలాగే తిరుగుతుండేవాడు. కానీ బుజ్జి మాత్రం తన తండ్రికి దెబ్బతగలడం వలన ఉద్యోగంకి వెళ్లక సెలవు పెట్టి ఇంటి దగ్గరే ఉండి అతన్ని బాగా చూసుకున్నది. దాంతో రామయ్య తొందరలోనే కొలుకున్నాడు.

రామయ్యకు తను చేసిన తప్పు అర్థం అయ్యింది. అతి గారాభం వలన తన కొడుకు ఎందుకు పనికిరాకుండా పోయాడని బాధపడ్డాడు. కొడుకు అయినా కూతురు అయినా ఇద్దరిని సమానంగా పెంచాలి అని మనసులో అనుకున్నాడు. తను చేసిన తప్పుకు బిడ్డను క్షమాపణ అడిగాడు.



-వేల్పుల శ్రీలత, 9వ తరగతి
జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల
నర్సింహుల పల్లి, ధర్మారం మండలం.

# ధర్మపురిలో వేంకటేశం ఆడియో గీతాల ఆవిష్కరణ



ప్రముఖ హృద్రోగ చికిత్స నిపుణులు డా. శ్రీధర్ కస్తూరి సౌజన్యంతో ధర్మపురికి చెందిన ప్రముఖ గీత రచయిత డా. గొల్లపెల్లి రాంకిషన్ (రాఖీ) రచించగా, సంగీత దర్శకులు కోమాండూరి రామాచారి స్వర కల్పనలో రూపొందించిన ఆడియో గీతాల ఆల్బమ్ శ్రీ వేంకటేశం ఈ రోజు స్థానిక బ్రాహ్మణ సంఘం భవనంలో ఆవిష్కరించడం జరి గింది. కుటుంబ సభ్యులు, మిత్రులు, స్థానికుల సమక్షంలో ఆవిష్కరించబడ్డ ఈ ఆల్బమ్ లోని 12 పాటలను ప్రఖ్యాత సినీ గాయకులు రమ్య బెహెరా, గీత మాధురి, శ్రీకృష్ణ, సాకేత్,సోనీ కోమండూరి,ఐశ్వర్య, అనుపమ, శ్రీకుమారి,ఆచార్య పి.వారి జారాణి, శృతిక,శ్రియామాధురి మరియు కోమాండూరి రామాచారి ఆలపించారు. ఎంతో భక్తి శ్రద్ధలతో గీతాలను రాసిన రాఖీని, వాటిని ఆడియో రూపంలో రావడానికి కృషి చేసిన డా. శ్రీధర్ కస్తూరి ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో డా. శ్రీధర్ కుటుంబసభ్యులు శ్రీమతి డా.సునీత శ్రీధర్. కే, కస్తూరి లక్ష్మి మనోహర్, కస్తూరి రవీందర్, గీత రచయిత రాఖీ, డా. శ్రీధర్ మిత్రులు జైస్ కిరణ్ సురేందర్ కుమార్, గుండి విష్ణు ప్రసాద్, దూస రాజేశ్వర్, సొల్ల భీమన్న, గాయని మణులు అనుపమ, శ్రీ కుమారి, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా **695**వ రోజు 'నటశేఖరుడు' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'నటశేఖరుడు' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...

-సంపాదకులు



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
*ఏకాంశ కవిత్వం నిర్వహణ:*
*-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839*

## అన్నీ రికార్డులే!

రికార్డుల హిమశిఖరం
ఘట్టమనేని వంశతిలకం
వెండి తెరకు
సాంకేతిక
సొబగులందించిన ఆధునికుడు
సినీ కథాగమనాన్ని
ఆకాశసంచారం
చేయించిన సృజనశీలి
చిన్నపాటి ప్రతిబింబాలను
'సింహాసనం' ఎక్కించి
డెబ్బై మిల్లీమీటర్ల స్థాయికి తెచ్చిన
నవపథ రూపశిల్పి
'అల్లూరి' గా మన్యం వీరుడిని
సినిమాస్కోపు తెరపై మలిచిన
సూపర్ స్టార్
ఏడో నెంబరు దగ్గరే ఆగిపోయిన
జేమ్స్ బాండును
నూట పదహారుగా
తెలుగు తెరకు ఎక్కించిన
సాహసికుడు
'మోసగాళ్లకు మోసగాడు'గా
కౌబాయ్ చిత్రాలను
రుచి చూపించిన
అశ్వారోహకుడు.
'పదండి ముందుకు'
అంటూ రంగులలోక ప్రవేశం
'తేనెమనసులు'తో
కథానాయక స్థాయి.
'పండంటి కాపురం'తో
కుటుంబగాథలు
'దేవుడు చేసిన మనుషులు'తో
మల్టీ స్టారర్ చిత్రాలు
రైతుబిడ్డలు మమేకమైన
పాడిపంటలు'
జనహృదయాల్లో కొలువు చేసిన
అమృతభాండాలు
ప్రజాయుద్ధ సంరంభ 'ఈనాడు'
రాజకీయ వ్యంగ్యాల్లో
మకుటాయమానం
సామాజిక బాధ్యతను.
మర్చిపోని పద్మభూషణుడు
కరువుల్లో వరదల్లో
ముందుకొచ్చిన ఆపన్నహస్తం
ఆ సినీతార
ఇపుడు గగనతార
అయినా
దూరమేమీ కాలేదు
ఎప్పుడూ ప్రజల మనసులు
ఘట్టమనేని కృష్ణుడి ఆవాసాలు.

-డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు

## వైవిధ్యచిత్ర నటుడు

ఎవరు చూసినా
ఏదో రంగంలో మూసధోరణిలోనే
ఇమేజ్ చట్రంలో తమకితామే
బందీలుగా విసుగొచ్చేసింది ప్రేక్షకులకు
అటువంటి సమయంలో
తేనెమనసుల్లో సరికొత్తనటనతో
పక్కింటి అబ్బాయిలా సహజంగా..
కృష్ణ ఆకట్టుకుని ఆ పాత్రలో ఒదిగాడు!
నటించిన ప్రతి సిన్మాకథ
మరపురాని కథే !!
దేనికదే వైవిధ్యం
'సాక్షి' అమాయకనీ
గూఢచారి 116' వీరత్వం
ఉత్సుకత
'సింహాసనం' రాజఠీవి..
'కురుక్షేత్రం' ఇతిహాసం
'అల్లూరి సీతారామరాజు' చరిత్రాత్మకం
ఆయన అభిరుచికి ఋజువులు!!
భగ్న ప్రేమికుడిగా
గొప్ప శిష్యుడు ఏకలవ్యగా
ఉమ్మడికుటుంబంలో తమ్ముడిగా,
అన్నగా
నటనలో మహిళా ప్రేక్షకులకు
బాగా నచ్చారు.
డ్యాన్సులకే పరిమితమో
ఇద్దరు హీరోయిన్స్ తో
ఒకేలాంటి కథల రబ్బరుస్టాంప్ కాదు
పద్మాలయా స్టూడియో నిర్మాణమే
సాహసం !!
సహనటిని వివాహమాడినా
కుటుంబం కూరిమితోనే !.

-ఎం.వి.ఉమాదేవి

## నేలకొరిగిన నట శిఖరం

ఘట్టమనేని ఇంటి పేరు
సాహసం ఒంటి పేరు
మంచితనానికి మారు పేరు
నవనీతం మనసు తీరు
తెగువలో సాటెవరు రారు
ధైర్యం రక్తంలో మమేకం
ముందడుగేయడంలో మొండితనం
కృషి ప్లస్ కసి నిండిన వ్యక్తిత్వం
కృషితో నాస్తి దుర్భిక్షమన్న
పదానికి అర్థం
మంచి మనసున్న మారాజు
ఈ అల్లూరి సీతారామరాజు
జనుల మదులు గెలిచిన రారాజు
ఈ మకుటం లేని మహారాజు
కొత్త ప్రయోగాలకు తానే యువరాజు
ఈ రామరాజ్యంలో భీమరాజు
ఘనులను ఢీకొని గెలిచిన ఘనుడు
అతని కంటే ఘనుడు
నిర్మాతల మనసు దోచిన దొంగ
దొంగలకు దొంగ
పరిశ్రమలో తనకు లేదెవరిపై కక్ష
తనకు తానే వేసుకునే నేరానికి శిక్ష
దాన గుణంలో కలియుగ కర్ణుడు
ఈ ధనవంతుడు గుణవంతుడు
కన్న ఊరిని ఉద్ధరించిన మనిషి
ఈ దేవుడు లాంటి మనిషి
అందమైన ముఖ వర్చస్సు
హృదయం ఇంద్రధనస్సు
నవ్వు మనోహరం
అంటాడు చల్ మోహనరంగా
నడిపించిన జగన్నాథ రథచక్రాలు
పండించిన పాడిపంటలు
మెండుగ ఉన్న భోగభాగ్యాలు
ఒక ధ్రువ తార నింగికెగసింది
ఒక నటశిఖరం నేలకొరిగింది
తేనె మనసు మూగబోయింది
మాటలకందని విషాదం మిగిలింది.

-జె.వి.కుమార్ చేపూరి

## స్వర్గం చిందులేస్తోంది

సినీ వినీలాకాశంలో
ఓ ప్రభంజనం
అంతవరకూ వెండితెరే ఊహించని
ఓ పెద్ద కుదుపు.
మూస కుటుంబ చిత్రాల హీరోలే కాదని
కౌబాయ్ జేమ్స్ బాండులూ ఉన్నారని
అరవై ఏళ్ళ క్రితమే
క్లాప్ కొట్టించిందో ఆకారం
ఆరడుగులకు తగ్గని మరకెరుగని అందం
తియ్యని తేనెతో మొదలై
తెలుగువారి తేజమేమిటో చాటింది..
సినీ పరిశ్రమే యుద్ధభూమిగా
కొంగొత్త ఆయుధాలను ప్రవేశపెట్టి
విజయం మనదేననే మనోధైర్యమిచ్చింది
వెండితెర కనుల నిండుగా
ఫుల్ స్కోపు సినిమాలు
తెలుగువాడు ఊహించని
70 ఎం.ఎం. చిత్రాలు
ప్రయోగాల పుట్టగా
పద్మాలయ స్టూడియోతో
బహుభాషా చిత్రాలతో
పురుడు పోసుకొంది.
ఎక్కడా అనుకరణలేని
తనదంటూ ఒక కొత్త వరవడితో
అలరించిందా ఆకారం
విరహాన్నైనా
విజయాన్నైనా
వీరత్వాన్నైనా
త్యాగాన్నైనా
భక్తినైనా
అనురక్తినైనా
కాలేజీ కుర్రాడైనా
కార్మిక నాయకుడైనా
చిలిపి ప్రేమికుడైనా
రక్తం చిందించే దేశభక్తుడైనా
ఏపాత్రపోషించినా తనదైన ముద్రే
ఏ చిత్రం నిర్మించినా జాతీయ
చిత్ర సీమకు నిద్ర కరువే
ఆ ఆరడుగుల అందాన్ని
బుర్రిపాలెం కంటే
ఆత్మీయంగా అక్కున చేర్చుకుందీ
యావత్ భారతావని
24ప్రేములు
బావురుమంటున్నాయి
కొత్త ప్రయోగాలు తండ్రిని కోల్పోయి
కంటతడి పెడుతున్నాయి
స్వర్గమేమో ముస్తాబై
స్వాగతం పలుకుతోంది
నటశేఖరుని కొరకై
సురకన్నెల
సింగారం పెరిగింది.

- గుర్రాల వేంకటేశ్వర్లు

## జ్ఞాపకాల పరిమళం

అతను కేవలం నటశేఖరుడేనా!
లక్షలాది అభిమానుల కులశేఖరుడు
కూడా
నటుడి కన్నా
మనసున్న మనిషిగా
పేరు పొందినవాడు
సాహసాన్ని ఊపిరి చేసుకున్నాడు
నా పిలుపే ప్రభంజనమని
తెలుగు సినిమాను
కొత్త ఎత్తులకు చేర్చాడు
జేమ్స్ బాండ్, కౌబాయ్,
డిటెక్టివ్ చిత్రాల వారసుడై
ఆనాటి
యువతరానికి ఆరాధ్యుడయ్యాడు
'దేవదాసు'కు మళ్లీ ప్రాణం పోశాడు
దెబ్బతిన్నా బెబ్బులిలా
'అల్లూరి సీతారామరాజు'ను
తెలుగు వారి గుండెల్లో ప్రతిష్ఠించాడు
ప్రయోగాల శిల్పి కదా
70ఎమ్ఎమ్ 'సింహాసనం'పై
తెలుగు సినిమాను కూచోపెట్టాడు
నిర్మాణం మెళకువలు తెలుసు
నిర్మాత కష్టాలు తెలుసు
నిర్మాతను కష్టపెట్టడం మాత్రం
తెలియనివాడు
నష్టానికి భుజం కాయటం తెలిసినవాడు
కాలం చెరలో
ఎవరైనా ఖైదుకావలసిందే
ఆప్తులను పోగొట్టుకున్నాడు
ఎంత వేదన పడ్డాడో!
అందరికి అల్విదా అంటూ
దివికి చేరుకున్నాడు
భువినున్న మనకోసం
జ్ఞాపకాల పరిమళమై మిగిలాడు.

- సి.ఎస్.రాంబాబు

## రియల్ హీరో

'తెలుగు వీర లేవరా!
దీక్ష బూని సాగరా!"
అంటూ తరతరాల
తెలుగు వారి
నరనరాల్లో దేశభక్తిని
ఉప్పొంగజేసి
స్వాతంత్ర్యోద్యమంలో
తెలుగువారి గణనీయ పాత్రను
సినీ గేయ సాహిత్యంలో
శాశ్వతంగా నమోదు చేసిన
నిలువెత్తు తేజోమూర్తి.
ఆంగ్ల చిత్రం 'మెకనాస్ గోల్డ్'ను
మొట్టమొదటి తెలుగు
భారీ చలనచిత్రంగా మలచి
'మోసగాళ్ళకు మోసగాడు'
చిత్రాన్ని నిర్మించి
తెలుగువాడి గుండెబలాన్ని
ప్రపంచానికి చూపించిన
బుర్రిపాలెం సాహసోపేతుడు
నిజ జీవితంలోనూ సహృదయుడు
చలనచిత్ర పరిశ్రమ నిర్మాతలకు
తోటి కళాకారులకు
పేదవారికి
అండదండగా నిలిచిన
రియల్ హీరో
తెలుగు చలనచిత్ర
సీమ సూపర్ స్టార్.

-ముద్దు వెంకటలక్ష్మి

## ఘట్టమనేని ఘటికుడు

ఘట్టమనేని ఘటికుడా!
గగనతలం బోసిపోయిందని
ఆహ్వానం పంపిందా?!
తేనె మనసులు
మృదు మధుర పలుకులు
కరువయ్యాయని
విన్నపాలు అందాయా?!
రామారావు రమ్మని పిలిచారా?!
అక్కినేని మీపై అలిగారా?!
ఏమంత తొందర వచ్చిందని
మమ్మల్ని వీడిపోయారు?!
గాన గంధర్వుడు
గగనానికేగమని చెప్పాడా ?!
బ్రహ్మ కొత్తగా స్క్రిప్ట్
ఏమైనా రాశాడా ?!
సతులనూ అగ్రసుతుడినీ
విడిచి ఉండలేక
నీవే తొందరపడ్డావా?!
ధైర్య సాహసాలకు
మారుపేరైన నీవే
ఇంతగా బేల పడిపోయావేం?!
'వస్తాడు నా రాజు' అంటూ
విజయనిర్మల ఎదురుచూస్తున్నారనా?!.

-పత్తెం విజయ రాఖీ

## వినూత్న ప్రయోగాల 'అగ్నిపర్వతం'

సూపర్ స్టార్
రియల్లీ ఎ రియల్ సూపర్ స్టార్
కృష్ణ ప్రస్థానం ఒక 'ప్రభంజనం'
డేర్ నెస్ లో 'నెంబర్ వన్'
మల్టీస్టారర్ వేసినా
"వారసుడు"ని
స్టార్ గా అందించినా
సినీ 'సింహాసనం'
ఘట్టమనేని కృష్ణ 'మంచి కుటుంబం'దే
అనుకరణకత్యంత పరిధి
కృష్ణ పాత్రలే
సినీ మానవీయ కోణాల
'మొనగాళ్ళకు మొనగాడు'
వినూత్న ప్రయోగాల 'అగ్నిపర్వతం'
విడిచివెళ్ళింది జగతిని 'ఈనాడు'

-ఉండవిల్లి సుజాతా మూర్తి

## నింగికెగసిన ధృవతార

తేనె మనసులతో
రంగప్రవేశం చేసి
మన మనసు దోచుకున్న
అద్భుత అందాల నటుడు!!.
తొలి జేమ్స్ బాండ్ గా
గూఢచారి అవతారమెత్తి
ఆంధ్రా జేమ్స్ బాండ్ అయ్యాడు
తొలి కౌబాయ్ గా
మోసగాళ్లకు మోసగాడు అయ్యాడు!!
తొలి 70 యం. యం. సినిమాలకు
ఆద్యుడై
తెలుగు సినీ సింహాసనం
అధిష్టించాడు
తొలి సినిమాస్కోప్
అల్లూరి సీతారామరాజుతో
తెలుగు వీరలేవరా అంటూ
ప్రతి తెలుగు వాడి గుండె
తట్టిలేపాడు!!
సాహసమే నా వూపిరి అంటూ
తన డేరింగ్ డ్యాషింగ్ నటనతో
ఐదు దశాబ్దాలు తెలుగు
సినీ సామ్రాజ్యాన్ని ఏలిన
నట శిఖరం!!.
తోటి చిన్న నటులను
తన తోబుట్టువుల్లా ఆదరించిన
సముద్రమంత సహృదయుడు
మనసున్న మారాజు!!.
ఆంధ్ర విశ్వకళాపరిషత్
గౌరవ డాక్టరేట్
కేంద్రప్రభుత్వ పద్మభూషణ్
ఆస్ట్రేలియా ప్రభుత్వం
ఆయన పేరున
విడుదలచేసిన పోస్టల్ స్టాంప్
ఎన్టీఆర్ జాతీయ పురస్కారం
కృష్ణ కిరీటంలో కలికితురాయిలు!!
ఐదు దశాబ్దాల
సుదీర్ఘ సినీ ప్రస్థానం
మూడువందల
యాభై చిత్రాలలో నటన
ఎన్నో అద్భుత వీర ఘట్టాలు
సృష్టించిన
బుర్రిపాలెం బుల్లోడు
ఘట్టమనేని శివరామ కృష్ణ
అంతిమ ఘట్టం చేరిన వేళ
యావత్ సినీ పరిశ్రమ
దుఃఖసముద్రంలో
మునిగిన వేళ
సినీ వినీలాకాశంలో
అయ్యాడు ధృవతార!!
అభిమానుల గుండెల్లో
కొలువైన చిరస్మరణీయుడు.

- పరిమి వెంకట సత్యమూర్తి

## గువ్వలా ఎగిరిపోయినదొక తార

తేనె మనసులతో తెరంగేట్రం
మహామహులు కలగన్న
అల్లూరి సీతారామరాజుగా సజీవ
నటన
ప్రేక్షక హృదయాలలో
తనదైన శైలిలో చెరగని ముద్ర
ఆ బహుముఖీనుడెంతో ప్రజ్ఞాశాలి
'నేనంటే నేనేగా' అంటూ
ఎదిగిన సౌమ్యశీలి
'మరపురాని కథ'తో
మురిపించిన
ప్రేమజీవి 'ప్రభంజను'డు
అగ్నిపర్వతం'లా సత్తా చాటుకుని
'అఖండుడు'గా చిత్రసీమకు
కర్పూర హారతి పట్టి
'దేవుడు చేసిన మనుషులు'గా
ఖ్యాతిపొందిన
బుర్రిపాలెం బుల్లోడు అసాధ్యుడు
అగ్ని కెరటాలలో కెరటమైన
'కన్నె మనసుల్లో' దాగిన కృష్ణుడైన
'పాడి పంటల'లో మెప్పించి
'గూఢచారి'గా చరిత్ర సృష్టించి
ఆంధ్ర జేమ్స్ బాండ్ కౌబాయిగా
పిలుపులందుకున్న
డేరింగ్ అండ్ డాషింగ్ హీరో
స్కోపైనా
సెవంటీ ఎమ్మెమ్మైనా
తెరతీసి
శంఖారావాన్ని పూరిస్తూ
పాత్రేదైనా ఒదిగిన
'సంక్రాంతి' హీరో ఆణిముత్యమే...
'సాక్షి'లో అమాయకుడైనా
'సింహాసనం'తో తన ఇమేజీని
అందనంత తారాస్థాయికి
తీసుకెళ్లిన శివరామకృష్ణ
సూపర్ స్టార్..
అవేకళ్ళు
వేటాడిన
బొమ్మలు చెప్పిన కథలు చూపించి
మహాబలుడిగా
ఆస్తులు అంతస్తుల
విలువ తెలుపుతూ
అంతా మనమంచికేనంటూ ఇలా
ఎన్నో ఎన్నెన్నో చిత్రాలలో
జీవించిన నటశేఖరుడు
సాహసోత్తముడు.
పద్మాలయ నిర్మాతగా
పద్మభూషణధారియై
అభిమానుల గుండెల్లో
జ్ఞాపకాలనెన్నోవదిలిన
చెరగని చిరునవ్వొకటి
అనంతలోకాలకు
గువ్వలా ఎగిరిపోయింది.

-శ్రీలతరమేశ్ గోస్కుల

(మొదటి పేజీ తరువాయి...)

వివరించారు.

కవి, రచయిత ఇసనాక మురళీధర్ మాట్లాడుతూ...."వర్ణిక వర్ణాల కలయిక. మల్లీశ్వరి గారు అవిశ్రాంత ఉపాధ్యాయులు. చాలామంది తెలుగేమిటో తెలియని వారికి తెలుగేమిటో చెప్తున్నారు. దాదాపు ఆవిడ రాసిన 42 పుస్తకాల్లో ఎందులో చూసినా తెలుగు భాష గొప్ప కవిత్వం కనిపిస్తుంది. ఇది లేఖాసాహిత్యం. ఎంతోమంది లేఖాసాహిత్యం రాశారు. ఇప్పుడు వాసిరెడ్డి గారు ఇంతమంచి కవితా సంకలనాన్ని లేఖల రూపంలో మనకి అందించారు. ఇలా అందించడానికి ఆవిడకి వచ్చిన భాషో, భావాల సంచయమో ఒక ఎత్తు అయితే... ఏ ఉపాధ్యాయులు చదువుని చెప్పారో, ప్రేరణ కలిగించారో ఆశ్చర్యం. ఈవిడ తనకు ఈ భాష, దానిపై ప్రేమ .... నన్ను నేను కోల్పోతూ.. ఒంటరినై.... (59 పేజీ) నా పద ప్రభంజనంవిస్ఫులింగా వానై....నా కవితలు నిండి వెలుగులు విరజిమ్మి విజయాల పరంపరై.... నన్ను నా ముందు నిలిపింది.నేనో పొలికేక లా ఈ లోకానికొచ్చాను. అమ్మాచూపు నన్నలా తాకిందో లేదో ఆత్మీయతై, ఆశ్వీస్సై నన్ను నిమిరిందో లేదో... అక్షరాలు నాకు అక్షింతలై నన్ను అభిషేకించాయి." "స్నేహిస్తూనే అడవి న్యాయపు రీతి నీతి రీతి చేస్పింది.నన్ను కొమ్ము బూరను, కోలను చేసింది." అంటూ తనలో కవిత్వం పొంగటానికి మూలాలు చెప్పారన్నారువర్ణిక మొత్తం లేఖలలో... సాహిత్యంతోబాటు ఒకరకమైన బాధ వెతుకులాట కనిపిస్తుంది.అంటే మనుషులెందుకిలా వున్నారు? అంటూ చాలాసార్లు ప్రస్తావించారు. బిఎన్ రెడ్డిగారి మల్లీశ్వరి ఎప్పటికీ మరిచిపోలేని సినిమా, ఒలింపిక్స్ లో సాధించిన విజయంతో కరణం మల్లీశ్వరి తెలుగు వారిని తలెత్తుకునే లాచేసింది, సాహిత్యంలో రాజావాసిరెడ్డి మల్లీశ్వరి ఇలా ప్రత్యేకంగా నిలుస్తుందని ఆశిస్తున్నాను అంటూ తమ విశ్లేషణని ముగించారు.

కవయిత్రి రచయిత్రి రాధాకుసుమగారు మాట్లాడుతూ...నేను ఎన్నో తెలియని విషయాలు తెలుసుకున్నాను.వర్ణిక చదవటం వలన జీవిత సత్యాలు తెలిశాయి. వర్ణికనే అద్భుత లేఖాసాహిత్యాన్ని చదువుతుంటే ఎంతో అద్భుతంగా అనిపించింది. ఇదో అందమైన సాహిత్య ప్రక్రియ. ఇందులో పెట్టిన పేర్లు చాలా పసందైన పేర్లు, మధురమైన, మంజులమైన ఈ వర్ణికలో ఆవిడ స్పృశించని అంశమేలేదు. అద్భుత ఊహా పరిమళాలతో.... కడు రమణీయం. లేఖాసాహిత్యానికి కొత్త ఊపిరిలద్దారని అన్నారు.

మల్లీశ్వరి గారి మిత్రురాలు విజ్జిక గారు మాట్లాడుతూ... నేను మల్లీశ్వరిగారు ఇంటర్మీడియట్ నుంచి కలిసి చదువుకున్నా 40 సంవత్సరాల నుంచీ మా స్నేహం ఎటువంటి అరమరికలు లేకుండా కొనసాగుతోంది. మల్లీశ్వరి రచనలు అత్యద్భుతమైనవి. భాషమీద ఎనలేని ప్రేమతో అందరికీ ఉపయోగపడే పరిశోధనా గ్రంథాలు రాయడం వల్ల, బాల సాహిత్యపు ఆణిముత్యాలు ఆవిడకి బాలబంధు అనే బిరుదునిచ్చాయి. గజల్స్ రాయడమనేది ఒక సాహసమని తెలిసినా అత్యంత జనాదరణ పొంది అంతర్జాతీయ రికార్డులని పొందడం ఆనంద దాయకం.

రమాదేవి కులకర్ణి మాట్లాడుతూ సాహితీ ప్రపంచంలో కరదీపిక నుడిగుడి. ఇవన్నీ యువతకి, ప్రతి బిడ్డకీ ఇవన్నీ చేరాలి. మీ పిపాస, తపన అందరికీ చేరాలని కోరుకుంటున్నాను... మరొక భువన విజయమై భాసిల్లాలని అంటూ ముగించారు. " మా ఊరి ఆణిముత్యం రాజావాసిరెడ్డి మల్లీశ్వరిగారు. వారిని చూడాలని., వారి వర్ణిక గురించి తెలుసుకోవాలని రేపల్లె నుండి వచ్చాను" అని అన్నారు రాజ్ కృష్ణ. చివరగా మల్లీశ్వరి గారు మాట్లాడుతూ.. వర్ణిక నేనెందుకు రాశాను అనేది వివరించారు. చిన్నప్పుడు స్నేహితుల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగే సమయంలో అవగాహన తక్కువ. సాహిత్యంలోకి పూర్తిగా వచ్చినప్పుడు నేను రాయాలి అనుకోవడానికి ఒక ప్రేరణ, ఆంధ్రజ్యోతి వాళ్ళు మీడియాహౌస్ సంస్థవాళ్ళు ప్రేమ లేఖలకై ప్రకటన ఇచ్చారు. వచ్చిన 1200 లేఖలలో నా లేఖ 75వ లేఖ అవడం నాకు చాలా ఆనందాన్నిచ్చింది. నా భాష వేరు, వా వ్యక్తీకరణ వేరు నా లేఖ అందులో రావడం నాకు చాలా గొప్పగా అనిపించింది. ఈ భావాలన్నీ కవితలుగా గాక లేఖలుగా ఎందుకు రాయకూడదు అనిపించింది. చివర నాగలక్ష్మి నాగరాజు వందన సమర్పణ చేశారు.

# "పిడికెడు బువ్వ కోసం" పుస్తకావిష్కరణ



ఈనెల 13న ఆదివారం రోజున ఉదయం 10:30 గంటలకు ముంతాజ్ కాలేజి, మలక్ పేట,హైదరాబాద్ లో "రొట్ట మాకు రేవు" కవిత్వ అవార్డు - 2022 ప్రదానోత్సవ సభలోశ్రీ ప్రసేన్ గారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిద్దిపేటకు చెందిన వర్ధమాన యువ కవి, రచయిత " గంగాపురం శ్రీనివాస్" రచించిన "పిడికెడు బువ్వ కోసం" (కవిత్వం) పుస్తకాన్ని ప్రముఖ కవి "కె. శివారెడ్డి" సరస్వతి సమ్మాన్ పురస్కార గ్రహీత ఆవిష్కరించారు. ప్రముఖ కవి, కవి సంగమం నిర్వాహకులు శ్రీ యాకూబ్ గారు, విమర్శకులు గుంటూరు లక్ష్మీనరసయ్య , వంశీకృష్ణ, కోయి కోటేశ్వరరావు, కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీతలు, తెలంగాణ సాహిత్య కళా పీఠం అధ్యక్షురాలు దాసరి శాంతకుమారి, రజని, వీరారెడ్డి, వడ్ల నరేష్ చారి ,తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుముల మురళీధర్, అశోక్, రవి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# అవినీతి వ్యతిరేక గేయాలు, వచన కవితల పోటీ

అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవినీతి వ్యతిరేక గేయాలు, వచన కవితల పోటీ...ఆంధ్ర ప్రదేశ్ ఆమ్ ఆద్మీ పార్టీ నిర్వహిస్తోంది. ప్రథమ బహుమతి అయిదు వేలు, ద్వితీయ బహుమతి మూడు వేలు, తృతీయ బహుమతి రెండు వేల రూపాయలు. అవినీతి వ్యతిరేకతతో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ లక్ష్యాలు కూడా ఉండేలా రచన లుండాలి. 24 పాదాలకు మించని రచనల్ని 9493686165 వాట్సప్ నంబరుకు మీ పేరు, వూరు, చిరునామాతో సహా టైప్ చేసి నవంబర్ 30 లోగా పంపించాలని కోరుతున్నాము. కవితల్ని SHO.AP.TV chanel ద్వారా అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం డిసెంబర్ 9న ప్రసారం చేయడం జరుగుతుంది... డా. రావి రంగారావు



పుస్తకం మనిషికి ప్రాణవాయువు లాంటిదని' ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ సభ్యులు కప్పగంతు రామకృష్ణ అన్నారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం మహాత్మా గాంధీ రోడ్డు లోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో 'కవిస్వరం' పేరుతో జరిగిన కవి సమ్మేళన సభలో రామకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ బుక్స్ ఎన్ని చదివినా రాని అనుభూతి ఒక పుస్తకం వల్ల కలుగుతుందని, అసలు పుస్తకం చేతపడితేనే ఒక ప్రత్యేకత మనిషి కలుగుతుందని రామకృష్ణ అన్నారు. సభకు అధ్యక్షత వహించిన రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ 'గ్రంథాలయాలు నిన్నటి తరానికి రేపటి తరానికి మధ్య వారధి' అన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తకం చదివితే అశేషమైన విజ్ఞానం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఠాగూర్ స్మారక గ్రంథాలయం గ్రంధాలయ అధికారి అల్లూరు రామచంద్రుడు, చలపాక ప్రకాష్ ఎస్ఎం సుభాని నిర్వహించారు. అనంతరం కోపూరి పుష్పాదేవి నిర్వహణలో జరిగిన కవి సమ్మేళనంలో కవులు కే ఆంజనేయ కుమార్, అరసవిల్లి కృష్ణ, మందరపు హైమావతి, వైష్ణవి శ్రీ వొరప్రసాద్, చిత్రాడ కిషోర్ కుమార్, సింహాద్రి వాణి, బొమ్ము ఉమామహేశ్వర్ రెడ్డి, స్టాలిన్, పాణిగ్రాహి రాజశేఖర్ తదితరులు వివిధ సామాజిక అంశాలతో కూడిన కవితలు వినిపించారు. కవులను రచయితల సంఘం పక్షాన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వెన్న వల్లభరావు శాలువాలతో సత్కరించారు.


విశాలాక్షి సాహిత్య మాస పత్రిక
శ్రీమతి గన్నవరపు సీతాలక్ష్మి గారి సౌజన్యంతో...

సంక్రాంతి ప్రేమ కథల పోటీ

ప్రేమ ప్రేమను ప్రేమిస్తుంది, ప్రేమ ఒక రాగరంజిత రసానుబంధం
ప్రేమకు ఏ ఒక్కరూ దూరం కాలేరు. ప్రేమ అన్ని వయస్సులలోనూ ,
అన్ని బంధాలలోనూ ఉత్తేజం కలిగించే ఒక ఉత్ప్రేరకం

బహుమతులు
రూ. 10,000/-

మొదటి బహుమతి రూ. 5000/-
ద్వితీయ బహుమతి రూ. 3000/-
తృతీయ బహుమతి రూ. 2000/-

● ఒకరు ఒక కథ మాత్రమే పంపాలి ● డిటిపి లేదా చేతి వ్రాత ఏదైనా పర్వాలేదు
● పోస్ట్, కొరియర్, రిజిస్టర్ పోస్ట్ ఎలాగైనా పంపవచ్చు ● మెయిల్ , వాట్సప్ లకు పరిశీలన కుదరదు ● న్యాయ నిర్ణేతలదే తుది నిర్ణయం ● హామీ పత్రం విడిగా (సెపరేట్ పేజీలో) రాయాలి ● రచయిత పేరు, ఫోన్ నంబర్ హామీపత్రంలోనే పొందుపరచాలి ● బహుమతి కథలతో పాటు సాధారణ ప్రచురణకు మరికొన్ని ఎంపిక జరుగుతుంది ● ఈ కథలన్నీ విశాలాక్షి మాసపత్రికలో ప్రచురణ జరుగుతుంది.
● కథలు డిటిపిలో 4 పేజీలు, చేతివ్రాతలో 6 పేజీలు మించకూడదు.
● జెరాక్స్ కాపీలు పరిశీలించబడవు

కథలు చేరవలసిన చివరి తేది 15-12-2022

రచనలు పంపవలసిన చిరునామా
VISALAKSHI MASA PATHRIKA
D.No. 27-5-487, Padmavathi Nagar,
Balaji Nagar Ext,Nellore - 524002.
Cell : 9440529785


# కొలకలూరి పురస్కారాలు-2023

కొలకలూరి సాహిత్య పురస్కారాలు 15 సంవత్సరాలుగా వివిధ ప్రక్రియలకు ప్రదానం చేయటం జరుగుతూ ఉంది. ఈ సంవత్సరం కూడా మూడు ప్రక్రియా గ్రంథాలకు మూడు పురస్కారాలు ప్రకటించగలగటం ముదావహం. ఈ పురస్కారాలకు తెలుగు సాహిత్యస్రష్టలు ప్రపంచంలో ఎక్కడున్నా అర్హులు.

1. కొలకలూరి భాగీరథీ కవిత్వ పురస్కారం-2023-**రూ.15,000**
2. కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం-2023-**రూ.15,000**
3. కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారం-2023-**రూ.15,000**

ఆయా ప్రక్రియల్లో ప్రచురితమైన గ్రంథాలు నాలుగేసి ప్రతులు పంపండి. ముగ్గురు సాహితీవేత్తల సంఘాలు మూడు వీటిని పరిశీలించి, పురస్కార గ్రంథాలు నిర్ణయిస్తాయి.

ఈ గ్రంథాలు 1-1-2020 తర్వాత ముద్రితమై ఉండాలి.రచయితలైనా, ప్రచురణకర్తలైనా తమ గ్రంథాలను **15-12-2022** లోగా చేరేటట్లుగా పంపండి.పురస్కార ప్రకటన **15.1.2023**న వెలువడుతుంది.

26.2.2023న హైదరాబాదులో జరిగే సభలో పురస్కారం ప్రదానం చేస్తారు.

**కవిత్వం:** ఒక్క కవి కావ్యం/ కవితల సంకలనం.
**నాటకం:** ఒక్క నాటకకర్త నాటకం/ నాటికల సంకలనం.
**పరిశోధన:** ఒక్క పరిశోధకుడి పరిశోధన గ్రంథం/ పరిశోధన వ్యాస సంకలనం.ఒక్కొక్క పురస్కారానికి నగదు **రూ.15,000/-** జ్ఞాపిక, శాలువా చొప్పున మూడు పురస్కారాలు ప్రదానం చేయబడతాయి.

**గ్రంథాలు పంపవలసిన చిరునామాలు:**

**కవిత్వం, నాటకం:**

ఆచార్య కొలకలూరి మధుజ్యోతి (సెల్: 94419 23172)తెలుగు శాఖాధ్యక్షులు & పరీక్ష విభాగం డీన్శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తిరుపతి-517 502. ఆం.ప్ర.

**పరిశోధన గ్రంథాలు:**

ఆచార్య కొలకలూరి సుమకిరణ్ (సెల్: 99635 64664)ఆంగ్లాచార్యులు, ఆంగ్లశాఖాధ్యక్షులు, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరుపతి-517 502. ఆం.ప్ర.

## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
(నేటినిజం ప్రతినిధి)

# 'బుధవారం బాద్షా'

పోటీ ఫలితాలు



అడ్మిన్: **రమాదేవి కులకర్ణి**



నిర్వహణ: ***శ్రీమతి సత్య నీలిమ వలిపే***
ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

(ప్రథమ)

## నువ్వు సల్లగుండాలె

బిడ్డా...
నేను అమ్మను మాట్లాడుతుండ
తొమ్మిది నెలల
ఎదురుసూపుల తర్వాత
ప్రశాంత రక్షణా వలయం ఇడిసిపెట్టి
గిప్పుడే బయటకొచ్చినవ్ గదా
జర నీకు కొన్ని మాటలు జెప్పాలె
నేను సెప్పినట్టు నడుసుకో తల్లీ.
అడవిల మృగాల కన్నా
సమాజంల మృగాళ్ళు శానామంది
తిరుగుతూ మాటేసి
పంజా ఇసురుతున్నరు
కాలనాగులు తమ జోలికి
వచ్చినోళ్లనే కాటేస్తయంట
ఇక్కడ మగ మద కాలనాగులు
నువ్వే మనకున్న గాని
పట్టుకొని కాటేసి విషము
సిమ్ముతయి
నువ్వు జర పైలం బిడ్డా.
అయినా భయపడమాకులే
గిప్పుడు ఆడోళ్ళంతా బాగా
సదువుకొని పెద్దపెద్ద కొలువులు
సేస్తున్నరంట
కష్టపడి పనిసేసి
ముందుకు పోతున్నరంట
నీవు గూడా బాగా సదవాలె
నీ అన్నం నీ కొంగుల ఉండాలె
నీ గుండెల్ల ధైర్యం ఉండాలె
నీ బతుకు సల్లగుండాలె
అందుకు నువ్వు మంచేదో
చెడు ఏదో తెలుసుకోవాలె
నీ జోలికి వచ్చిన సెడ్డోళ్లకు
శివంగిలా మారి బుద్ధి చెప్పాలె
భద్రకాళివై తిరగబడాలె
అప్పుడే నువ్వు మంచిగుంటవు
సిన్నప్పుడైనా పెద్దగైనాక గూడా
నువు జర పైలంగుండాలె
బంగారమసొంటి నా బిడ్డా.



-రమాదేవి
బుక్కపట్నం
ఊరు దిల్ షుక్ నగర్,
హైదరాబాద్.

## బిడ్డా!ఎన్నెల తల్లీ!

బిడ్డా!
నువ్వొక ఎన్నెలవే!
చల్లని ఎన్నెలవి!
నువ్ లేకుంటె ఎన్నెలేది?
నువ్ లేకుంటె ఎన్నెల్లాంటి ప్రేమేది?
ఎన్నెల్లాంటి నిన్ను ఎడారిని జేస్తున్నరు!
ఎదంతా గడబిడ ఐతాంది బిడ్డా!
పిచ్చి కుక్కలు
నెలల పిల్లకాన్నించి..
ముసలి తల్లి దాన్క..
నిన్నొక చించే విస్తరిగ జూస్తుండ్రు!
బిడ్డా!
జర పైలం!
చెబ్దమంటె ..
కండ్లళ్ళ నీళ్ళు ఒడిసెటట్టు లేదు
అయ్యట్ల ఒడవకుండ
కార్తనే వున్నయ్!
ఆడిపిల్లైతె చాలు
నంజుకతినే నక్కలు నక్కి జూస్తుంటయ్!
ఇంట్ల వుండెటట్లు లేదు!
బయట మన్నెటట్లు లేదు!
ఎట్ల బతుకుతవొ బిడ్డా!
బిడ్డా!నిన్ను
అమ్మ పొట్టలోనె
ఖతంజేసె ఉపాయాలు!
అమ్మ ఒడిలోనె
ఊపిరితీసే పన్నాగాలు!
బడి బస్సులోనె మసిజేసె కుతంత్రాలు!
బడి ఒడిలోనె నలిపేసే కర్కోటకులు!
కళాశాల ముంగిలిలోనే కత్తులతో
నరికేసే దొంగప్రేమికులు!
ఉద్యోగపు కార్యాలయంలోనే
అంతంచేసే కామాంధులు!
మత్తులో మునిగి తేలే
దున్నపోతుల కామదాహం!
భర్త ముసుగులో కనిపించే..
కనిపించని హింస!
ఎన్నని చెప్పను బిడ్డా!
ఎట్ల ఇయ్యన్ని దాటి వస్తవ్!
గుబులైతుంది బిడ్డా!
నిజంగనె
నీ పెయ్యి నిండ
ముండ్లను పెంచితె
బాగుండును బిడ్డా!
నీ చూపునిండ అగ్గిని రాజేస్తె
మంచిగుంటది బిడ్డా!
నీ గుండె నిండ రోషం నింపితె
మస్తుగుంటది బిడ్డా!
బిడ్డా!
నీ చల్లని ఎన్నెలని తెలుసుకోలేని
మదాంధుడు
కడతేరిపోవాలె బిడ్డా!
అందుకే నువ్ చల్లని
ఎన్నెలగనె వుండకు.
మంటమండే
సూరీడుగ కూడ వుండాలె!
నిజం బిడ్డా!
నువ్ మండే సూరీడవ్వాలె!.



-వేదన
ఖమ్మం

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.